జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

✆ సంప్రదించవలసిన నెంబర్లు
9440231967

కృష్ణ | సోమవారం 3 ఆగస్టు 2026 | సంపుటి : 01 | సంచిక :200 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం పర్వదినం: సికింద్రాబాద్ బోనాలు, స్పెషల్ ఉత్సవం సూర్యోదయం: 5.40 । సూర్యాస్తమయం: 6.27 చంద్రోదయం: 9.03 । చంద్రాస్తమయం: 8.35 తిథి: బహుళ చవితి రా. 9.07 వరకు, తదుపరి పంచమి నక్షత్రం: పూర్వాభాద్ర రా. 8.41 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర యోగం: అతిగండం రా. 10.34 వరకు, తదుపరి సుకర్మ కరణం: బవ ఉ. 9.15 వరకు, తదుపరి బాలువ రా. 9.07 వరకు, తదుపరి కౌలవ

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## జెన్-జీ ఎప్పుడూ బీజేపీతోనే ఉన్నారు


- సమాజంలోని ప్రతి వర్గం మోదీకి అండగా నిలుస్తుందనే నమ్మకం ఉంది: పీయూష్
- మోదీ దార్శనికతతో దేశాన్ని మాదక ద్రవ్య రహితంగా చేయడమే లక్ష్యం
- భారతదేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చాలనే మన యువత ఉత్సాహం వికసిత్ భారత్‌కు పునాది వేస్తుంది : పీయూష్ గోయెల్ వెల్లడి



## బీజేపీలో ఎక్కువ మంది చందా దొంగలే



- ఆ విషయంలో బాధ్యతెందుకు వహించరు?
- శిలా పూజ నుంచి విరాళాల చోరీ మొదలైందని ఆరోపించిన కాంగ్రెస్
- బీజేపీ రామమందిరాన్ని నిర్మించలేదని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్మాణం జరిగిందని వ్యాఖ్యలు



## రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత బలం

- అదనపు పన్నుల వాటా కేటాయింపు.. కేంద్రానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు
- ఏపీకి కేంద్రం నుంచి రూ.4,597 కోట్ల అదనపు పన్నుల వాటా విడుదల
- నిధులు కేటాయించినందుకు ప్రధానికి, ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు
- సాధారణ తేదీ కంటే ముందుగానే నిధులు విడుదల చేయడంపై హర్షం
- ఈ సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతాయని వెల్లడి

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం అదనపు పన్నుల వాటాను విడుదల చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో అందిన ఈ ఆర్థిక చేయూత రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత బలాన్ని ఇస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన కేంద్రం - మిగతా3లో

# మారుతున్న రాజకీయం

- పాదయాత్రల నుంచి పబ్లిక్ సర్వీస్ వరకు...
- మారుతున్న రాజకీయాల కొత్త ఫార్ములా!
- ఒకప్పుడు రాజకీయాల్లో ప్రజల మనసు గెలవాలంటే పాదయాత్రే ప్రధాన ఆయుధంగా ఉండేది
- వేల కిలోమీటర్లు నడిచి ప్రజల సమస్యలు తెలుసుకోవడం ద్వారా నాయకులు తమ రాజకీయ ప్రస్థానాన్ని బలోపేతం చేసుకునేవారు
- కానీ కాలం మారుతోంది... రాజకీయ కమ్యూనికేషన్ కూడా మారుతోంది




**హైదరాబాద్/అమరావతి**

ఒకప్పుడు రాజకీయాల్లో ప్రజల మనసు గెలవాలంటే పాదయాత్రే ప్రధాన ఆయుధంగా ఉండేది. వేల కిలోమీటర్లు నడిచి ప్రజల సమస్యలు తెలుసుకోవడం ద్వారా నాయకులు తమ రాజకీయ ప్రస్థానాన్ని బలోపేతం చేసుకునేవారు. కానీ కాలం మారుతోంది... రాజకీయ కమ్యూనికేషన్ కూడా మారుతోంది. ఇప్పుడు జాబ్ మేళాలు, మెడికల్ క్యాంపులు, మహిళా సమావేశాలు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువ కావడం వంటి కొత్త పద్ధతులు రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. మరి నిజంగానే - మిగతా3లో



## జంతర్ మంతర్ వేదికగా విధ్వంసానికి పాక్ ప్లాన్

- జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న హమిమ్ మండల్ అనే ఉగ్రవాద అనుమానితుడిని తూర్పు బర్ధమాన్ జిల్లాలో అరెస్ట్
- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల జరిగిన నిరసనల్లో పోలీసుల వేషధారణలో చొరబడి అల్లర్లు సృష్టించాలనేది ఈ ఉగ్రవాద కుట్ర ప్రధాన లక్ష్యం
- రాష్ట్ర ముఖ్యమంత్రి కదలికలపై నిఘా ఉంచాలని, రక్షణ లేని ప్రాంతాల వివరాలు సేకరించాలని పాకిస్థాన్ హ్యాండ్లర్లు హమిమ్‌ను ఆదేశించినట్లు వెల్లడి



## వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం

- వికసిత భారత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా 'నశా ముక్త్ యువ' ప్రారంభం
- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 2047 నాటికి వికసిత భారత్ సాధనకు ఆరోగ్యవంతమైన యువత అవసరం



## భోగాపురానికి వేగవంతమైన అనుసంధానం

- ఉత్తరాంధ్ర అభివృద్ధికి కోస్టల్ కారిడార్ కీలకం
- 88 మలుపులు, 31 వంతెనలతో కోస్టల్ కారిడార్‌కు ప్రణాళిక
- భూసేకరణ ఖర్చు రూ.1,331 కోట్లు
- ఎన్‌హెచ్-16కు అనుసంధానం అయ్యేలా కోస్టల్ కారిడార్

**అమరావతి**

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త ఊపునిచ్చే ప్రతిష్ఠాత్మక కోస్టల్ కారిడార్ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. విశాఖపట్నంలోని జోడుగుళ్లపాలెం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వరకు ఆరు వరుసలతో నిర్మించనున్న ఈ రహదారి, తీరప్రాంత రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు దారి తీయనుంది. సముద్ర తీరాన్ని ఆనుకుని నిర్మించనున్న ఈ కారిడార్ వల్ల విశాఖ నగరం నుంచి భోగాపురం విమానాశ్రయానికి అత్యంత తక్కువ సమయంలో చేరుకునే అవకాశం కలగనుంది. ప్రస్తుతం జాతీయ రహదారి-16పై ఉన్న ట్రాఫిక్ ఒత్తిడి కూడా గణనీయంగా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఎలైన్‌మెంట్‌ను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఇప్పటికే ఖరారు చేయగా, విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) - మిగతా3లో

## ఏపీ అభివృద్ధిలో ఆస్ట్రేలియా భాగస్వామ్యం

- మంత్రి లోకేశ్ చొరవతో 4 ఎంఓయూలు
- ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య నాలుగు కీలక రంగాల్లో వ్యూహాత్మక ఒప్పందాలు
- గతంలో మంత్రి లోకేశ్ పర్యటనకు కొనసాగింపుగా కుదిరిన ఎంఓయూలు
- ఏపీలో సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- ఆటిజం విద్య, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధికి చర్యలు



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య సంబంధాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇరుప్రాంతాల మధ్య అభివృద్ధి, నైపుణ్యం, ఆవిష్కరణలే లక్ష్యంగా నాలుగు కీలక రంగాల్లో వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదిరాయి. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్, ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, అభివృద్ధి, బహుళ సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్‌ల సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. గతేడాది తాను ఆస్ట్రేలియాలో జరిపిన పర్యటన సందర్భంగా జరిగిన చర్చలకు ఇది కార్యాచరణ రూపమని మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా తెలిపారు. మంత్రి నారా లోకేశ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఒప్పందాలు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కుదిరాయి. ముఖ్యంగా క్లీన్ ఎనర్జీ, - మిగతా3లో




## ఈనెల 5న సీజేపీ కోర్ కమిటీ సమావేశం

- భవిష్యత్ కార్యాచరణపై చర్చ
- అభిజీత్ దీప్కే నివాసంలో సీజేపీ కోర్ కమిటీ భేటీ
- భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్న సీజేపీ కోర్ కమిటీ
- ఈ ఉద్యమాన్ని క్షేత్రస్థాయికి ఎలా తీసుకెళ్లాలి?
- విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ విషయమై కేంద్రంపై ఎలా ఒత్తిడి తీసుకురావాలనే అంశాలపై ప్రధానంగా చర్చించే అవకాశం

# వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం

దేశ యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి దూరంగా, శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే 'వికసిత భారత్' సంకల్పం నెరవేరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో నేటి తరం యువత చూపిస్తున్న నిబద్ధత, సామాజిక స్పృహ తన నమ్మకాన్ని మరింత బలపరిచాయని ఆయన ప్రశంసించారు. నేడు 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రధాని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా యువతను ఏకతాటిపైకి తెచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 'మై భారత్' వాలంటీర్ల నేతృత్వంలో ఇది ఒక ప్రజా భాగస్వామ్య (జన్ భాగీదారీ) ఉద్యమంగా రూపుదిద్దుకుంది. "మనం ఒక గొప్ప, ముఖ్యమైన సంకల్పం కోసం ఇక్కడ సమావేశమయ్యాం. ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి, కుటుంబం లేదా సమాజం కోసం కాదు. ఇది దేశం కోసం. వికసిత భారత్ దిశగా దేశం అడుగులు వేస్తున్నప్పుడు, యువత డ్రగ్స్ సమస్యకు దూరంగా ఉండటం అత్యవసరం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాశీతో ఈ కార్యక్రమానికి ఉన్న అనుబంధాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. "కాశీ ఎంపీగా, ఈ కార్యక్రమం గతేడాది పవిత్ర కాశీ క్షేత్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. దీనివల్ల ఈ కార్యక్రమానికి శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, సాధువుల ఆశీస్సులు, సాంస్కృతిక వారసత్వం కూడా తోడయ్యాయి" అని ఆయన అన్నారు. 2025 జులైలో వారణాసిలో జరిగిన యూత్ స్పిరిచ్యువల్ సమ్మిట్‌లో దేశంలోని 125 ఆధ్యాత్మిక సంస్థలు ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌తో 'కాశీ డిక్లరేషన్'ను ఆమోదించాయని, వారంతా లక్షలాది పౌరులకు సేవ



చేస్తున్నారని మోదీ వివరించారు. యువతను దేశానికి 'అమృత తరం' (అమృత్ పీఢి)గా అభివర్ణించిన ప్రధాని.. "రాబోయే 20-25 ఏళ్లలో మీ జీవితాలకు మీరే దిశానిర్దేశం చేసుకుంటారు. 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేసేది మీరే. ఆ విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించేది కూడా మీరే. దేశానికి మీ శక్తి, సృజనాత్మకత, ప్రతిభ ఎంతో అవసరం. కాబట్టి దేశం కోసం, మీ సొంత జీవితాల కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండండి" అని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు, ధ్యాన శిబిరాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే యువతే వికసిత భారత్‌కు అసలైన బలం' అనే సందేశాన్ని దేశంలోని ప్రతి యువకుడికి చేర్చడమే ఈ ఉద్యమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# జెన్-జీ ఎప్పుడూ బీజేపీతోనే ఉన్నారు

జెన్ జీ ఎల్లప్పుడూ బీజేపీతోనే ఉన్నారని, సమాజంలోని ప్రతి వర్గం ప్రధాని మోదీకి అండగా నిలుస్తుందనే నమ్మకం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ ఆదివారం అన్నారు. మోదీ ప్రారంభించిన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్'ను గోయెల్ ప్రశంసించారు. దేశ యువత ఉత్సాహం భారతదేశాన్ని మాదకద్రవ్య రహితంగా మారుస్తుందని ఆయన అన్నారు. "జెన్ జీ ఎల్లప్పుడూ మాతోనే ఉన్నారు. జెన్ జీ మద్దతు, యువత శక్తి లేకుండా ప్రధాని మూడుసార్లు గెలిచి ఉండేవారు కాదు. సమాజంలోని ప్రతి వర్గం ప్రధాని మోదీతో నిలబడుతుందనే పూర్తి విశ్వాసంతో మేము ఉన్నాం. భారతదేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చాలనే మన యువత ఉత్సాహం వికసిత్ భారత్‌కు పునాది వేస్తుంది. ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా యువతీ యువకులు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సాగే ఈ సామూహిక పోరాటంలో చేరతారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని పీయూశ్ గోయెల్ అన్నారు.

**రాహుల్ గాంధీ భయపడుతున్నారు!**

మరోవైపు ప్రధాని మోదీకి యువతలో పెరుగుతున్న ఆదరణ చూసి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భయపడుతున్నారు అని గోయెల్? అన్నారు. రాహుల్ గాంధీ గతంలో తనకు తానే యువ నాయకుడిగా చెప్పుకుంటారు. కానీ ఇప్పుడు ఆ స్థాయి ఆదరణ ఆయనకు లేదు అని ఎద్దేవా చేశారు. యువ ఓటర్లు మద్దతు ఎప్పుడూ బీజేపీకే ఉంటుందని అన్నారు. భారత్?ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న ప్రధాని మోదీ దార్శనికతకు వారు జై కొడుతున్నారని పేర్కొన్నారు.

**డ్రగ్స్ రహిత సమాజం కోసం**

1997 నుంచి 2012 మధ్య జన్మించిన యువతను జెన్ జీ ఉంటారు. ప్రధాని మోదీ ఈ రోజు 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్? భారత్ సంకల్ప్? అభియాన్?' ప్రారంభించి, 28 వేలకుపైగా ప్రాంతాల్లోని కోటి మందికి పైగా యువతతో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా మాట్లాడారు. తాము ప్రారంభించిన ఈ కార్యక్రమం వ్యక్తిగత శ్రేయస్సుతో పాటు, కుటుంబాలు, సమాజం, యావత్ దేశ విస్తృత ప్రయోజనాలను అందిస్తుందని పేర్కొన్నారు. వికసిత్ భారత్?



సంకల్ప్ అభియాన్? కోసం మాదకద్రవ్య రహిత సమాజం ఉండాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ముఖ్యంగా యువత శారీరకంగా ఆరోగ్యంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, ఆత్మవిశ్వాసంతో ఉండాలని అన్నారు. మాదకద్రవ్యాల వంటి వినాశకరమైన అలవాట్లకు శాశ్వతంగా దూరంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్‌లో భాగంగా చేపట్టిన మాదక ద్రవ్య రహిత యువత కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని డ్రగ్స్ రహిత సమాజం దేశాభివృద్ధికి ఎంత అవసరమో వివరించారు. గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇప్పుడు 125 ఆధ్యాత్మిక సంస్థల సహకారంతో దేశవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. యువత భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు కేంద్రప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందని చెప్పారు. ఈ ఉద్యమం కేవలం ఓ వ్యక్తి కోసమో, ఓ కుటుంబం కోసమో కాదని వాటన్నింటికి మించి దేశం కోసమని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే యువత శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో ఉండటమే కాకుండా డ్రగ్స్ లాంటి మహమ్మారులకు దూరంగా ఉండటం అత్యంత ఆవశ్యకమని ప్రధాని చెప్పారు. "ఓ యువకుడు డ్రగ్స్ మహమ్మారి బారినపడితే, అప్పుడు ఆ యువకుడే మాత్రమే కాదు ఓ కల కూడా ఓడిపోతుంది. ఓ కల అంతరించిపోతుంది. ఓ కుటుంబం ఓడిపోతుంది. కుటుంబమంతా నాశనం అవుతుంది. సమాజం కూడా అసహ్యించుకుంటుంది. మత్తు కేవలం శరీరానికి మాత్రమే నష్టం చేయదు. మత్తు ఓ తల్లి నవ్వును కూడా లాగేసుకుంటుంది" అని మోదీ అన్నారు.

## విద్యార్థుల ఆందోళనలో ఉగ్రవాదుల కుట్ర

# పోలీసు యూనిఫాంలో చొరబడేందుకు యత్నం

బంగాల్‌లో రెండ్రోజుల క్రితం పట్టబడ్డ అనుమానిత ఉగ్రవాది హమీమ్ మోండల్ పోలీసుల విచారణలో కీలక విషయాలు వెల్లడించాడు. ఇటీవల దిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల చేపట్టిన ఆందోళనల్లోకి చొరబడి, అల్లర్లు సృష్టించేందుకు అతడు ప్లాన్ చేసినట్లు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఐజీ గౌరవ్ శర్మ తెలిపారు. బంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని సైతం లక్ష్యంగా చేసుకున్నాడని వెల్లడించారు. అతడికి సహకరించిన యువతిని కూడా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

**బంగాల్ సీఎం లక్ష్యంగా ప్రణాళికలు**

బంగాల్లోని తూర్పు బర్ధమాన్ జిల్లాలో హమీమ్ మోండల్ అనే అనుమానిత ఉగ్రవాదిని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు రోజుల క్రితం అరెస్టు చేశారు. ఉగ్రసంస్థ జైషే మహ్మద్ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు అతడు పనిచేస్తున్నట్లు ఐజీ గౌరవ్ శర్మ తెలిపారు. ముఖ్యమంత్రి సువేందు అధికారి కదలికలపై నిఘా ఉంచి, ఆయనకు ఎక్కడ భద్రత తక్కువగా ఉంటుందో సమాచారం సేకరించాలని పాకిస్థానీ హ్యాండ్లర్లు హమీమ్‌ను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. పోలీసు యూనిఫాంలో దిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనల్లోకి చొరబడి, విధ్వంసం సృష్టించేందుకు కూడా అతడు ప్లాన్ చేశాడని చెప్పారు.

**పోలీసుల అదుపులో ఝార్ఖండ్ యువతి**

అయితే అతడు జంతర్‌మంతర్ వద్దకు వెళ్లాడా? లేదా? అనే విషయాన్ని తెలుసుకోవడానికి ఉగ్ర హ్యాండ్లర్‌లతో వారు చేసిన చాట్‌లను పరిశీలిస్తున్నామని ఐజీ గౌరవ్ శర్మ వివరించారు. హమీమ్‌కు సహకరించిన ఝార్ఖండ్ యువతి అర్పితా సర్కార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



హనీట్రాప్ ద్వారా రాజకీయ నాయకులు, ప్రముఖుల నుంచి సమాచారం సేకరించి వాటిని హమీమ్‌కు పంపుతోందని పోలీసులు తెలిపారు. యువతి అర్పిత సర్కార్ హమీమ్‌కు ప్రియురాలని అధికారులు వెల్లడించారు. బంగాల్ మంత్రి ఉమేష్ రాయ్ కుమారుడిని హనీట్రాప్ ద్వారా కిడ్నాప్ చేసి, భారీగా డబ్బు వసూలు చేసేందుకు వీరిద్దరూ ప్లాన్ చేసినట్లు విచారణలో వెల్లడైంది. చిన్నస్థాయి నేతలను పరిచయం చేసుకొని వారి ద్వారా ప్రముఖ నేతలపై నిఘా పెట్టడం, తమ వారిని రాజకీయ పార్టీల్లో కార్యకర్తలుగా నియమించడం వంటి పనులకు హమీమ్ ఆమెను వినియోగించుకునేవాడు.

**దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు**

పాకిస్థాన్‌కు చెందిన షెహజాద్ భట్టి గ్యాంగ్‌తో వీరికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. రానా, ఉజైర్, అబిద్ జట్, అనే పేర్లతో ఉన్న పాక్ హ్యాండ్లర్ల ద్వారా వీరికి ఆదేశాలు వచ్చినట్లు గుర్తించారు. ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా నిందితులిద్దరూ సమాచారాన్ని పంచుకునేవారని కనుగొన్నారు. సోషల్ మీడియా ద్వారా పరిచయమైన ఈ ఇద్దరూ, తర్వాత పాకిస్థాన్ ఆపరేటర్ల వలలో పడి తీవ్రవాద భావజాలాన్ని అలవర్చుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వీరు ఎస్?టీఎఫ్ కస్టడీలో ఉన్నారు. ఈ ఉగ్రవాద నెట్‌వర్క్‌కు సంబంధించి మరిన్ని వివరాలు రాబట్టేందుకు అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రసంస్థ జైషే మహ్మద్‌కు చెందిన ఐదుగురు ముష్కరులను గుజరాత్ ఏటీఎస్ అధికారులు గతంలో అరెస్టు చేశారు. పటన్ జిల్లా సిద్ధ్‌పూర్ తాలూకా ఖడియాల్ గ్రామంలో వీరందరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని బిలాల్ అబిద్‌భాయ్ షేరా, మహ్మద్ అయూబ్ కడివాలా, మహ్మద్ పాలన్‌పురి, షఫియా రాయిస్ ముక్తి, మహ్మద్ హసన్ కర్ధియాగా గుర్తించారు. అహ్మదాబాద్‌ను కేంద్రంగా చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు ఈ ముఠా ప్రయత్నించినట్లు ఏటీఎస్ అధికారులు పేర్కొన్నారు. ఈ మాడ్యూల్ గుజరాత్‌కే పరిమితం కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించే ప్రయత్నం చేసినట్లు అనుమానాలు ఉన్నాయని స్పష్టం చేశారు. నిందితులను అహ్మద్, ఇబ్రహీం, ముదస్సిర్, జకారియా దురానీ, ముఫ్తీ ఫౌజాన్, మహమ్మద్ అమీన్ షేరా, మహమ్మద్ అబ్దుల్, బిలాల్ మహమ్మద్‌గా ఏటీఎస్ అధికారులు గుర్తించారు.

## ఈనెల 5న సీజేపీ కోర్ కమిటీ సమావేశం

కాక్రోచ్ జనతా పార్టీ తదుపరి కార్యాచరణపై దృష్టి పెట్టింది. ఈ నెల 5న భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేసేందుకు కాక్రోచ్ జనతా పార్టీ కోర్ కమిటీ సమావేశం జరగనుంది. ఛత్రపతి శంభాజీనగర్‌లోని అభిజీత్ దీప్కే నివాసంలో ఈ భేటీ జరగనుందని సీజేపీ వర్గాలు తెలిపాయి. వాలంటీర్లు, విద్యార్థులతో మాట్లాడి వారి ఆలోచనలు, సూచనలతో సమావేశానికి రావాలని సీజేపీ కోర్ కమిటీ సభ్యులకు సూచించినట్లు పేర్కొన్నాయి. ఈ ఉద్యమాన్ని క్షేత్రస్థాయికి ఎలా తీసుకెళ్లాలి? విద్యార్థులపై నమోదైన కేసుల ఉపసంహరణ విషయమై కేంద్రంపై ఎలా ఒత్తిడి తీసుకురావాలనే అంశాలపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. ఈ భేటీ తర్వాత జబ్రూ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరోవైపు జబ్రూ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే చిన్నారులతో కలిసి స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకొన్నారు. విద్యార్థులు, స్థానికులతోపాటు పొరుగు జిల్లాల నుంచి వచ్చిన సందర్శకులను కలిశారు. దిల్లీ జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా జబ్రూ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలకు దేశవ్యాప్తంగా జెన్-జీల నుంచి విశేష స్పందన లభించటమే కాకుండా గతవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన రాజీనామా చేయాల్సి వచ్చింది.

**అభిజీత్ దీప్కే కుటుంబ ఆర్థిక వ్యవహారాలపై దర్యాప్తు చేపట్టాలని డిమాండ్**

మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కుటుంబ ఆర్థిక వ్యవహారాలపై దర్యాప్తు చేపట్టాలని సూరత్‌కు చెందిన ఆర్టీఐ కార్యకర్త అమిత్ తివారీ విజ్ఞప్తి చేశారు. మహారాష్ట్రలో రిటైర్డ్ ఉద్యోగి అయిన దీప్కే తండ్రి భగవాన్‌రావు కుమారుడి అమెరికా ఉన్నత విద్యకు అవసరమైన నిధులు ఎలా సమకూర్చారో పరిశీలించాలని ఆదాయపు పన్ను అధికారులకు ఫిర్యాదు చేశారు. అదే సమయంలో సీజేపీకి సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ ప్రకటించిన రూ.కోటి న్యాయ సహాయ నిధిపై కూడా విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ నిధిపై జీఎస్టీ వర్తిస్తుందా అనే విషయాన్ని కూడా సంబంధిత అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఇటీవల నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులకు న్యాయ సహాయం అందించేందుకు ప్రజల విరాళాలతో ఆన్‌లైన్ లీగల్ ఎయిడ్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సీజేపీ వెల్లడించింది. ఈ నేపథ్యంలో సిబల్ విరాళాన్ని ప్రకటించారు. సీజేపీ నమోదైన రాజకీయ పార్టీ కాదని, అలాంటప్పుడు నిధులు స్వీకరించడం చట్టబద్ధమేనా అనే అంశాన్ని పరిశీలించాలని ఆర్టీఐ కార్యకర్త ఎన్నికల సంఘాన్ని కోరారు.

**దీప్కేకు స్వల్ప అస్వస్థత**

అంతకుముందు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే శనివారం అస్వస్థతకు గురయ్యారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లోని ఆయన నివాసంలో వైద్యులు పరీక్షించి విశ్రాంతి తీసుకోవాలని సలహా ఇచ్చారు. దీప్కేకు రక్తపోటు స్వల్పంగా తగ్గిందని, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారని వైద్యులు వివరించారు. ఉదయం తన నివాసం పార్కింగ్ ప్రాంతంలో తనను కలిసేందుకు వచ్చిన కొందరితో మాట్లాడుతున్న సమయంలో ఆయన అసౌకర్యానికి గురైనట్లు తెలిపారు. ఉదయం 11.45 గంటల సమయంలో పార్కింగ్ వద్దకు వచ్చిన వారిని కలిసేందుకు కిందకు వచ్చిన దీప్కే కొద్దిసేపటికే అసహనంగా అనిపించడంతో ఇంటి వెనుక భాగానికి వెళ్లి వాంతి చేసుకున్నారు. దీప్కేను డాక్టర్ విశాల్ లహానే పరీక్షించారు. రక్తపోటు 100/60 స్థాయిలో స్వల్పంగా తక్కువగా ఉందని తెలిపారు. ప్రస్తుతం జ్వరం లేదని, విశ్రాంతి తీసుకుంటే కోలుకునే అవకాశం ఉందని లహానే వివరించారు.

**నీట్ ఎఫెక్ట్- రూ.7.5 కోట్లతో భద్రతకు టెండర్ల ఆహ్వానం**

మరోవైపు నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదం నేపథ్యంలో ఎన్‌టీఏ (చీూా) పరీక్షల భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ప్రణాళికలు రచించింది. ఇందుకోసం ప్రధాన కార్యాలయం, ప్రాంతీయ కార్యాలయాలు, సర్వర్ గదులు, స్ట్రాంగ్‌రూమ్‌లు, ప్రశ్నపత్రాల నిల్వ కేంద్రాలకు 24 గంటల భద్రత కల్పించేందుకు సుమారు రూ.7.5 కోట్లతో టెండర్‌ను పిలిచింది. రెండేళ్ల పాటు అమలయ్యే ఈ ఒప్పందానికి ఆగస్టు 17 వరకు బిడ్లను ఆహ్వానించింది. భద్రతతో పాటు హౌస్‌కీపింగ్, సెక్యూర్ ప్రింటింగ్ (అత్యంత సురక్షితంగా ప్రశ్నపత్రాల ముద్రణ) కోసం టెండర్లను ఆహ్వానిస్తోంది.

## జంతర్ మంతర్ వేదికగా విధ్వంసానికి పాక్ ప్లాన్

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) పోలీసులు భారీ ఉగ్రకుట్రను భగ్నం చేశారు. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న హమిమ్ మండల్ అనే ఉగ్రవాద అనుమానితుడిని తూర్పు బర్ధమాన్ జిల్లాలో అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల జరిగిన నిరసనల్లో పోలీసుల వేషధారణలో చొరబడి అల్లర్లు సృష్టించాలనేది ఈ ఉగ్రవాద కుట్ర ప్రధాన లక్ష్యమని ఎస్టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ గౌరవ్ శర్మ తెలిపారు. అంతేకాకుండా, రాష్ట్ర ముఖ్యమంత్రి కదలికలపై నిఘా ఉంచాలని, రక్షణ లేని ప్రాంతాల వివరాలు సేకరించాలని పాకిస్థాన్ హ్యాండ్లర్లు హమిమ్‌ను ఆదేశించినట్లు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి నిందితుడిని కోర్టు 14 రోజుల ఎస్టీఎఫ్ కస్టడీకి అప్పగించింది. మరోవైపు, హమిమ్ ప్రియురాలు అర్పితా సర్కార్‌ను శుక్రవారం జార్ఖండ్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. షాజాద్ భట్టీ గ్యాంగ్‌కు చెందిన పాకిస్థాన్ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు వీరిద్దరూ ఈ కుట్రకు పాల్పడ్డారు. రాజకీయ నాయకులు, ప్రముఖులను హానీట్రాప్ చేసి, వారి నుంచి రహస్య సమాచారం రాబట్టడంలో అర్పితా సర్కార్ సిద్ధహస్తురాలని పోలీసుల విచారణలో తేలింది. రాష్ట్ర మంత్రి ఉమేష్ రాయ్ కుమారుడిని హానీట్రాప్ చేసి కిడ్నాప్ చేయడానికి, కుటుంబం నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయడానికి వారు ప్లాన్ చేశారు. నిందితుల వద్ద నుంచి బ్రిటన్, మెక్సికో దేశాలకు చెందిన అంతర్జాతీయ సిమ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్ హ్యాండ్లర్లు రానా, ఉజైర్, అబిద్ జాట్, హమాద్‌లతో ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ ద్వారా వీరు సంభాషణలు జరిపినట్లు ఎస్టీఎఫ్ గుర్తించింది. సోషల్ మీడియా ద్వారా రాడికలైజ్ అయిన వీరిద్దరూ గత నాలుగేళ్లుగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమై ప్రేమలో ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వీరి ఉగ్రమూలాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## బీజేపీలో ఎక్కువ మంది చందా దొంగలే

అయోధ్యలోని రామమందిరానికి సంబంధించిన విరాళాల చోరీ ఆరోపణల వ్యవహారంలో బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది కాంగ్రెస్. ఆ పార్టీలో ఉన్నవారందరూ చందా దొంగలు కాకపోవచ్చు కానీ, ఎక్కువ మంది కచ్చితంగా అధికార పార్టీలోనే ఉన్నారని పేర్కొంది. రామమందిరంలో జరిగిన ఆ చోరీ కేవలం విరాళాలకు మాత్రమే పరిమితం కాలేదని, ఇది శిలా పూజ సమయం నుంచే మొదలైందని ఆరోపించింది. ఈ మేరకు సీనియర్ కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ ఆదివారం పలు వ్యాఖ్యలు చేశారు. "నేను స్వయంగా అవధ్ ప్రాంతానికి చెందినవాడిని. 1985 - 1990 మధ్య కాలంలో ఉత్తర్?ప్రదేశ్ ప్రభుత్వంలో పర్యటక శాఖ మంత్రిగా పనిచేశాను. రామజన్మభూమి ఉద్యమాన్ని నేను చాలా దగ్గరుండి చూశాను. బీజేపీలో ఉన్నవారందరూ చందా దొంగలు అని నేను అనడం లేదు, కానీ ఎక్కువ చందా దొంగలు మాత్రం బీజేపీలోనే ఉన్నారు."

"రామమందిర నిర్మాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు రామ్ లల్లా హమ్ ఆయేంగే; మందిర్ వహీం బనాయేంగే' (రామలల్లా, మేము వస్తాం- అక్కడే మందిరాన్ని నిర్మిస్తాం) అనేది నినాదంగా ఉండేది. ఆ తర్వాత ఉత్తర్?ప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు, మందిరం ఎప్పుడు నిర్మిస్తారని నేను అడిగాను. దానికి బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడని సమాధానం వచ్చింది" అని ఆయన చెప్పారు. "కేంద్రంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు, నేను మళ్లీ అదే ప్రశ్న అడిగాను. అప్పుడు 'ప్రస్తుతానికి వేచి చూడండి' అని సమాధానం వచ్చింది. అసలు నిజం ఏమిటంటే - అయోధ్యలో రామమందిరం నిర్మించాలని బీజేపీ ఎప్పుడూ కోరుకోలేదు. కేవలం రామమందిర సమస్యను సజీవంగా ఉంచాలని మాత్రమే భావించింది" అని ఆరోపించారు. మరో నిజమేమిటంటే బీజేపీ రామమందిరాన్ని నిర్మించలేదని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్మాణం జరిగిందని అన్నారు. అయితే రామమందిర నిర్మాణ సమయంలోనే లోక్‌సభ ఎన్నికలు జరిగాయని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మందిరం కంటే ఎన్నికలే ముఖ్యమయ్యాయని ఆరోపించారు. ఫలితంగా, ఆయన అసంపూర్తిగా ఉన్న మందిరానికి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారని, ఇది అశుభకరమైన చర్య అంటూ ఆయన అభిప్రాయపడ్డారు. అసలు పూజా కార్యక్రమాలను శంకరాచార్యులే నిర్వహించి ఉండాల్సింది, కానీ వారిని ఆ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆహ్వానించలేదని ఆయన అన్నారు. ఆ మొత్తం ప్రక్రియ బాధ్యతను ప్రధాని మోదీ స్వయంగా తీసుకున్నారని, ఆలయ ట్రస్ట్‌లోని ప్రతి సభ్యుడిని కూడా ఆయన వ్యక్తిగత ఇష్టాయిష్టాల మేరకే నియమించారని ప్రమోద్ తివారీ ఆరోపించారు.

# ఏపీ అభివృద్ధిలో ఆస్ట్రేలియా భాగస్వామ్యం

-మొదటిపేజీ తరువాయి

అత్యాధునిక తయారీ, సమ్మిళిత విద్య, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో ఈ భాగస్వామ్యం కీలకం కానుంది. ప్రతిభ, ఆవిష్కరణ, ఉమ్మడి శ్రేయస్సు పునాదులపై ఆంధ్రప్రదేశ్–ఆస్ట్రేలియా భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసేందుకు ఈ ఒప్పందాలు దోహదపడతాయని లోకేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా బృందం సీఎం చంద్రబాబుతోనూ సమావేశమైంది.

**సౌరశక్తి హబ్‌గా ఆంధ్రప్రదేశ్**

పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనలో భాగంగా, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆవిష్కరణల హబ్‌గా మార్చే దిశగా తొలి అడుగు పడింది. ఐఐటీ తిరుపతి, ఏపీ ప్రభుత్వానికి చెందిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (జశీజుజు), సిడ్నీకి చెందిన యూఎన్‌ఎస్ డబ్ల్యూ యూనివర్సిటీ సంయుక్తంగా ఏపీలో "సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటు చేయనున్నాయి. దీని ద్వారా అత్యాధునిక సోలార్ పీవీ తయారీ, రీసైక్లింగ్, పరిశ్రమ ఆధారిత పరిశోధన, ఫ్యాకల్టీ అభివృద్ధి, ప్రపంచస్థాయి నైపుణ్య శిక్షణపై దృష్టి సారిస్తారు.

**విద్య, మానసిక ఆరోగ్యానికి పెద్దపీట**

"ప్రతి చిన్నారి నేర్చుకోవడానికి, ఎదగడానికి, రాణించడానికి అర్హులు" అనే ఉద్దేశంతో ఆటిజం, ఇతర న్యూరోడైవర్స్ అభ్యసన అవసరాలున్న విద్యార్థులకు సమ్మిళిత విద్యను బలోపేతం చేసేందుకు మరో ఒప్పందం కుదిరింది. యూఎన్‌ఎస్ డబ్ల్యూ సిడ్నీ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తాయి. ప్రత్యేక ఉపాధ్యాయులకు, సాధారణ టీచర్లకు ఆధునిక శిక్షణ అందించి, ఏపీ విద్యార్థుల



అవసరాలకు తగిన వనరులను అభివృద్ధి చేస్తారు. అలాగే, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, శ్రేయస్సుకు ప్రాధాన్యతనిస్తూ, రౌండ్ డింపుల్ సంస్థ భాగస్వామ్యంతో ఎంపిక చేసిన ఉన్నత విద్యాసంస్థల్లో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. దీని ద్వారా విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది లేకుండా గోప్యంగా వెల్‌నెస్ అసెస్‌మెంట్‌లు, వర్చువల్ కౌన్సెలింగ్ సేవలను పొందవచ్చు.

**ప్రపంచస్థాయి ఉద్యోగాలకు యువత తయారీ**

రాష్ట్ర యువతకు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఏపీఎస్ఎస్‌డీసీ, ఆస్ట్రేలియాకు చెందిన డైనమిక్ లెర్నింగ్ సర్వీసెస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా వృత్తి విద్య, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, వృత్తిపరమైన ధ్రువపత్రాలు, అంతర్జాతీయ ఉపాధి మార్గాలను బలోపేతం చేస్తారు. ఈ చర్యల ద్వారా నేటి ఉద్యోగాలకే కాకుండా, రేపటి కెరీర్‌లకు సైతం ఏపీ యువతను సిద్ధం చేస్తున్నామని లోకేశ్ వివరించారు.

# కర్నూలులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెంచ్ ఏర్పాటు

**కర్నూలు :** రాయలసీమ ప్రాంత ప్రజల దశాబ్దాల నాటి ఆకాంక్ష అయిన కర్నూలులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చేసిన ప్రకటన తీవ్ర ఆసక్తికరమైన చర్చకు తెరలేపింది. 90 రోజుల్లో కర్నూలులో హైకోర్టు బెంచ్ అందుబాటులోకి వస్తుందని ఆయన ప్రకటించారు. అయితే, ఒక రాష్ట్రంలో లేదా ప్రాంతంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం అనేది కేవలం రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలోని అంశం మాత్రమే కాదు. దీనికి సుదీర్ఘమైన రాజ్యాంగపరమైన, న్యాయపరమైన, పరిపాలనాపరమైన ప్రక్రియలు అవసరమవుతాయి. అందుకే 90 రోజుల గడువు సాధ్యమేనా? అసలు బెంచ్ ఏర్పాటు వెనుక ఉండే చట్టపరమైన క్రమం ఏమిటి? సాధారణంగా ఏదైనా రాష్ట్రంలో హైకోర్టుకు చెందిన ఒక ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయాలంటే ది స్టేట్ హైకోర్ట్స్ యాక్ట్ లేదా సంబంధిత పునర్వ్యవస్థీకరణ చట్టాల నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది. కర్నూలులో బెంచ్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మొదట రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించాలి. అనంతరం, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమక్షంలోని ఫుల్ కోర్ట్ ముందుకు ఈ ప్రతిపాదన వెళుతుంది. హైకోర్టు ఫుల్ కోర్ట్ ఈ బెంచ్ ఏర్పాటుకు సాంకేతిక, మౌలిక వసతుల సాధ్యాసాధ్యాలను పరిశీలించి పూర్తి స్థాయిలో ఆమోదం తెలపాల్సి ఉంటుంది. హైకోర్టు ఫుల్ కోర్ట్ అంగీకారం తెలిపిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనను కేంద్ర న్యాయ శాఖ కు నివేదిస్తుంది. కేంద్ర ప్రభుత్వం దీనిని భారత ప్రధాన న్యాయమూర్తి , సుప్రీంకోర్టు కొలీజియం పరిశీలనకు పంపుతుంది. సుప్రీంకోర్టు సీజేఐ , కొలీజియం నుండి అనుమతి లభించిన తర్వాత మాత్రమే, కేంద్ర హోంశాఖ భారత రాష్ట్రపతి ఆమోదం కోసం ఫైలును పంపుతుంది. భారత రాజ్యాంగంలోని అధికరణ 214, సంబంధిత నిబంధనల ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసిన తర్వాతే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చట్టబద్ధంగా రూపుదిద్దుకుంటుందిరాజ్యాంగపరమైన ఈ ప్రక్రియతో పాటు



క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన అత్యంత ప్రధానమైనది. బెంచ్ నిర్వహణకు అవసరమైన తాత్కాలిక లేదా శాశ్వత భవనాలు, న్యాయమూర్తులకు నివాస సదుపాయాలు , కోర్టు హాళ్లు, రిజిస్ట్రీ సెక్షన్లు, అడ్వకేట్ రూమ్‌లు, పోలీస్ బందోబస్తు , డిజిటల్ నెట్‌వర్కింగ్ వంటి మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేయాలి. వీటితో పాటు అమరావతిలోని ప్రధాన హైకోర్టు నుండి కర్నూలు బెంచ్‌కు ఏ ఏ జిల్లాల కేసుల అధికార పరిధి బదిలీ చేయాలనే దానిపై న్యాయ పరిపాలనా పరమైన స్పష్టత రావాల్సి ఉంటుందిఇంతటి సుదీర్ఘ ప్రక్రియ ఉన్నప్పటికీ మంత్రి నారా లోకేష్ 90 రోజుల గడువు విధించడం వెనుక కూటమి ప్రభుత్వ వ్యూహాత్మక ఆలోచన ఉందని రాజకీయ, న్యాయ విశ్లేషకులు భావిస్తున్నారు. కర్నూలులో ఇప్పటికే లోకాయుక్త వంటి న్యాయ సంస్థలకు ఉద్దేశించిన భవనాలు సిద్ధంగా ఉన్నందున, ప్రాథమికంగా తాత్కాలిక భవనంలో బెంచ్ కార్యకలాపాలు ప్రారంభించే వెసులుబాటును ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రంతో మంచి సఖ్యతతో ఉన్నందున, రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం త్వరితగతిన పూర్తి చేసి, సుప్రీంకోర్టు, హైకోర్టు సీజేల అనుమతుల ప్రక్రియను ఫాస్ట్ ట్రాక్ చేయాలనేది లోకేష్ వేసిన కచ్చితమైన ముందస్తు ప్రణాళికగా కనిపిస్తోంది. గతంలో బెంచ్ ఏర్పాటు ప్రక్రియలపై న్యాయవాదుల నిరసనలు, వినతులు జాప్యానికి కారణమైన ఆధారాలు ఉన్నాయి. అందువల్ల, 90 రోజుల్లో అన్ని రాజ్యాంగ ఆమోదాలు, రాష్ట్రపతి ఉత్తర్వులు పొందడం సవాలుతో కూడుకున్నదే అయినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం గట్టి పట్టుదలతో పరిపాలనాపరమైన క్లియరెన్సులను వేగవంతం చేస్తే, నిర్ణీత సమయంలో లేదా దానికి సమీప కాలంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ కల సాకారమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# కుప్పంలో విమానాశ్రయం ఏర్పాటుకు చకచకా అడుగులు

సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో విమానాశ్రయం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తోంది. త్రిరాష్ట్ర కూడలిలో ఉన్న కుప్పంలో 'కార్గో ఎయిర్‌పోర్ట్'ను సాకారం చేసే దిశగా అధికారులు చర్యలు వేగవంతం చేశారు. శాంతిపురం, రామకుప్పం మండలాల సరిహద్దులో ఉన్న రామాపురం వద్ద దీన్ని ఏర్పాటు చేయాలని సర్కార్ నిర్ణయించింది. శనివారం నాడు విజయనగరం జిల్లాలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అట్టహాసంగా ప్రారంభించిన నేపథ్యంలో కుప్పంలోనూ త్వరలోనే విమానాలు ఎగురుతాయనే ఆశాభావం సర్వత్రా వ్యక్తమవుతోంది. విమానాశ్రయం నిర్మాణంతో పాటు పారిశ్రామిక ప్రగతి దిశగా సర్కార్ అడుగులు వేస్తోంది. వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధికి దోహదపడేలా ఈ కార్గో ఎయిర్‌పోర్ట్?ను నిర్మించనున్నారు. ఇందులో టెర్మినల్, రన్‌వే నిర్మాణానికి దాదాపు 500 ఎకరాలను కేటాయించారు. మరో 500 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. గత నెల మొదటి వారంలో కుప్పంలో పర్యటించిన సీఎం చంద్రబాబు, విమానాశ్రయం అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. తాను మళ్లీ కుప్పం వచ్చే సరికి ఎయిర్?పోర్ట్?కు భూమిపూజ చేస్తామని ఆయన ప్రకటించారు. దీంతో యంత్రాంగం కార్యాచరణను మరింత వేగవంతం చేసింది.

**వెయ్యి ఎకరాల సమీకరణ**

ఎయిర్‌పోర్ట్, పరిశ్రమల కోసం శాంతిపురం, రామకుప్పం మండలాల్లో దాదాపు వెయ్యి ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరిస్తోంది. వాస్తవానికి 2014–2019 టీడీపీ హయాంలోనే విమానాశ్రయ స్థాపనకు అడుగులు పడ్డాయి. అప్పట్లోనే 500



ఎకరాలు సేకరించి రైతులకు పరిహారం కూడా చెల్లించారు. 2019 జనవరిలో సీఎం చంద్రబాబు రామాపురం వద్ద విమానాశ్రయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పుడు కొత్తగా మరో 500 ఎకరాలను అదనంగా సేకరిస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే చాలా మంది అన్నదాతలకు పరిహారం అందించారు.

విమానాశ్రయానికి మెరుగైన కనెక్టివిటీ కోసం పలమనేరు–క్రిష్ణగిరి జాతీయ రహదారి నుంచి రెండు అప్రోచ్ రోడ్లను నిర్మించనున్నారు. ఈ రోడ్ల కోసం 129 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. శాంతిపురం సమీపంలోని జాతీయ రహదారి (ఎన్‌హెచ్–42) నుంచి మొదటి అప్రోచ్ రోడ్డును నిర్మిస్తున్నారు. అమ్మవారిపేట వరకు 5.5 కిలోమీటర్ల మేర సాగే ఈ రోడ్డు కోసం 51.42 ఎకరాలను సేకరిస్తున్నారు. గుండిశెట్టిపల్లె నుంచి సొన్నేగానిపల్లె, కిలాకిపోడు మీదుగా రెండో అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకు 49.23 ఎకరాలను సమీకరిస్తున్నారు. ఈ రెండు అప్రోచ్ రోడ్ల మధ్య కనెక్టింగ్ రోడ్డు నిర్మాణానికి 25 ఎకరాలను సేకరించనున్నారు. సొన్నేగానిపల్లె, దండికుప్పం రెవెన్యూ పరిధిలో ఈ ప్రక్రియ సాగనుంది.

**పల్లెలకు కొత్త బీటీ రోడ్లు**

శాంతిపురం, రామకుప్పం మండలాల నుంచి విమానాశ్రయం కోసం ప్రతిపాదించిన భూములకు రోడ్ల అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. శాంతిపురం–విజలాపురం, కుప్పం–విజలాపురం, రామకుప్పం–విజలాపురం మార్గాల్లో ఇప్పటికే డబుల్ రోడ్ల వసతి అందుబాటులో ఉంది. ఇప్పుడు ఎయిర్‌పోర్ట్, పరిశ్రమల కోసం ప్రతిపాదించిన భూములకు కనెక్టివిటీ పెంచుతున్నారు. దండికుప్పం, అమ్మవారిపేట, సొన్నేగానిపల్లె, కిలాకిపోడు, కడిసినకుప్పం, బొందలగట్టు, మణీంద్రం, ఇందిరానగర్, వెంకటేశపురం తదితర గ్రామీణ రోడ్లపై కొత్తగా బీటీ రోడ్ల నిర్మాణాలను ముమ్మరంగా చేపడుతున్నారు.

## మారుతున్న రాజకీయం

-మొదటిపేజీ తరువాయి

పాదయాత్రల యుగానికి ప్రత్యామ్నాయం వచ్చిందా? తెలుగు రాష్ట్రాల్లో గత రెండు దశాబ్దాలుగా పాదయాత్రలు రాజకీయ విజయానికి కీలక వ్యూహంగా నిలిచాయి. 2003లో వై.ఎస్. రాజశేఖర రెడ్డి చేపట్టిన పాదయాత్ర, ఆ తర్వాత చంద్రబాబు నాయుడు నిర్వహించిన "వస్తున్నా మీ కోసం", వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన "ప్రజా సంకల్ప యాత్ర" వంటి కార్యక్రమాలు రాజకీయంగా పెద్ద మైలురాళ్లుగా నిలిచాయి. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడానికి ఇవి సమర్థమైన వేదికలుగా మారాయి.

**ఇప్పుడు ఎందుకు మారింది?**

అయితే ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సోషల్ మీడియా విస్తరణతో నాయకుడు ఒక గ్రామంలో చేసిన కార్యక్రమం క్షణాల్లోనే లక్షల మందికి చేరుతోంది. దీంతో ప్రజలను కలవడానికి పాదయాత్ర ఒక్కటే మార్గం కాదనే భావన బలపడుతోంది. ఇక ప్రజల అంచనాల్లో కూడా మార్పు కనిపిస్తోంది. "ఎంత నడిచారు?" అనే ప్రశ్న కంటే "ఏం చేశారు?" అనే ప్రశ్నకు ఇప్పుడు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. ముఖ్యంగా యువత ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, విద్య వంటి అంశాలపై నాయకుల చర్యలను గమనిస్తోంది. అందుకే రాజకీయ నాయకులు కూడా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో నిరంతర ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

**కొత్త రాజకీయ ఆయుధాలు**

ఇటీవలి కాలంలో మెగా జాబ్ మేళాలు, ఉచిత వైద్య శిబిరాలు, మహిళా సంఘాలతో సమావేశాలు, రైతు అవగాహన సదస్సులు, స్కిల్ ట్రైనింగ్ క్యాంపులు, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు వంటి కార్యక్రమాలు విస్తృతంగా కనిపిస్తున్నాయి. ఇవి ఏ ఒక్క పార్టీకి మాత్రమే పరిమితం కాకుండా వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు అమలు చేస్తున్న కార్యక్రమాలుగా మారుతున్నాయి.

**పెరుగుతున్న డిజిటల్ కమ్యూనికేషన్**

అదే సమయంలో ప్రచార విధానంలో కూడా గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు పోస్టర్లు, భారీ బహిరంగ సభలు ప్రధాన ప్రచార సాధనాలైతే, ఇప్పుడు రీల్స్, షార్ట్ వీడియోలు, లైవ్ స్ట్రీమింగ్, డిజిటల్ కమ్యూనికేషన్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. స్థానిక స్థాయిలో చిన్న సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలతో నిరంతర సంబంధాన్ని కొనసాగించే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. అయితే రాజకీయ విజయాన్ని ఒక్క అంశంతోనే ముడిపెట్టలేమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. పార్టీ బలం, అభ్యర్థి వ్యక్తిత్వం, స్థానిక పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, ఎన్నికల సమయంలో నెలకొనే రాజకీయ వాతావరణం వంటి అనేక అంశాలు కలిసి ఫలితాలను ప్రభావితం చేస్తాయి.

**భవిష్యత్ రాజకీయాలు!**

2029 ఎన్నికల్లో మరోసారి భారీ పాదయాత్రలే ప్రధాన అస్త్రంగా మారతాయా? లేక జాబ్ మేళాలు, సేవా కార్యక్రమాలు, డిజిటల్ కమ్యూనికేషన్, ప్రజలతో నిరంతర అనుబంధమే కొత్త రాజకీయ ఫార్ములాగా నిలుస్తుందా? దీనికి సమాధానం భవిష్యత్తులోనే తేలనుంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది... ప్రజలతో అనుసంధానమయ్యే పద్ధతులు మారుతున్నాయి... వాటికి అనుగుణంగా రాజకీయాలు కూడా కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి.

## భోగాపురానికి వేగవంతమైన అనుసంధానం



-మొదటిపేజీ తరువాయి

మాస్టర్‌ప్లాన్‌లోనూ పొందుపరిచింది. పర్యాటకం, పారిశ్రామిక అభివృద్ధి, విమానాశ్రయ అనుసంధానం వంటి అంశాల్లో ఈ రహదారి కీలక పాత్ర పోషించనుంది.

**జోడుగుళ్లపాలెం నుంచి భోగాపురం వరకు**

కోస్టల్ కారిడార్ మొత్తం పొడవు 37.882 కిలోమీటర్లు. ఇందులో కొంత భాగాన్ని ఇప్పటికే ఉన్న రహదారులను విస్తరించే బ్రౌన్‌ఫీల్డ్ పద్ధతిలో, మిగిలిన భాగాన్ని పూర్తిగా కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ పద్ధతిలో నిర్మించనున్నారు. జోడుగుళ్లపాలెం వద్ద ప్రారంభమయ్యే ఈ మార్గం సాగర్‌నగర్, రుషికొండ, మంగమారిపేట మీదుగా సాగి ఐఎన్ఎస్ కళింగ సమీపంలోని ఎర్రమట్టిదిబ్బల వద్ద నుంచి నేరెళ్లవలస మీదుగా భోగాపురం విమానాశ్రయం సమీపంలో ఎన్‌హెచ్–16కు అనుసంధానం కానుంది.

మొత్తం మార్గంలో 18.717 కిలోమీటర్ల మేర ఇప్పటికే ఉన్న రహదారులను విస్తరించనున్నారు. ఇందులో 4.806 కిలోమీటర్లను 35 మీటర్ల వెడల్పుతో ఆరు వరుసలుగా అభివృద్ధి చేయనుండగా, మరో 4.282 కిలోమీటర్లను 45 మీటర్ల వెడల్పుతో విస్తరించనున్నారు. అదనంగా 9.629 కిలోమీటర్ల మేర 35 మీటర్ల వెడల్పుతో ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. మిగిలిన 19.165 కిలోమీటర్లను గ్రీన్‌ఫీల్డ్ తరహాలో పూర్తిగా కొత్త మార్గంగా అభివృద్ధి చేయనున్నారు. ఈ మార్గం ద్వారా విశాఖ బీచ్ రోడ్డుకు ప్రత్యామ్నాయంగా వేగవంతమైన రవాణా సౌకర్యం ఏర్పడనుంది.

**ఎలివేటెడ్ కారిడార్లతో ట్రాఫిక్‌కు చెక్**

ఈ ప్రాజెక్టులో ప్రత్యేక ఆకర్షణగా ఎలివేటెడ్ కారిడార్లు నిలవనున్నాయి. తెన్నేటి పార్క్ నుంచి భీమిలి వరకు రాడిసన్ బ్లూ హోటల్, ఐఎన్ఎస్ కళింగ, తొట్లకొండ ప్రాంతాల్లో మూడు ప్రధాన ఎలివేటెడ్ కారిడార్లను నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. ప్రస్తుతం ఉన్న రహదారులపై వీటిని నిర్మించడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వేగవంతమైన ప్రయాణం కల్పించాలన్నది లక్ష్యం.

అలాగే తెన్నేటి పార్క్ నుంచి ఐఎన్ఎస్ కళింగ వరకు 35 మీటర్ల వెడల్పుతో రహదారిని అభివృద్ధి చేయనున్నారు. ఈ క్రమంలో ప్రజల ఇళ్లు, ప్రైవేటు ఆస్తులకు వీలైనంత తక్కువ నష్టం కలిగేలా ప్రణాళిక రూపొందించారు. ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్న చోట పూర్తి స్థాయిలో విస్తరణ చేపట్టగా, ప్రైవేటు ఆస్తులు ఉన్న ప్రాంతాల్లో పరిమిత విస్తరణకే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఏఐను కోరినట్లు సమాచారం. అయితే ఆ ప్రతిపాదనలకు ప్రస్తుతానికి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది.

కోస్టల్ కారిడార్ పూర్తయితే విశాఖ నగరం, భీమిలి, భోగాపురం విమానాశ్రయం మధ్య వేగవంతమైన రాకపోకలు సాధ్యమవుతాయి. అంతేకాదు పర్యాటక రంగానికి కొత్త ఊపు రావడంతో పాటు ఉత్తరాంధ్రలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు భవిష్యత్తులో ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రధాన చోదకశక్తిగా నిలవనుందని భావిస్తున్నారు.

## రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత బలం

-మొదటిపేజీ తరువాయి

నుంచి రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల అవుతుంది. అయితే, ఈసారి గడువుకు ముందే ఏపీకి అదనంగా రూ.4,597 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ కేటాయింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా స్పందించారు. "అదనపు పన్నుల వాటాను కేటాయించినందుకు ప్రధాని మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర ప్రజల తరఫున ధన్యవాదాలు. కేంద్రం విడుదల చేసిన ఈ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత వేగవంతం అవుతుంది" అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అందిస్తున్న సహకారం ఎంతో కీలకమని చంద్రబాబు అన్నారు. ఈ సహకారం రాష్ట్ర పురోగతికి గొప్పగా దోహదపడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రం నుంచి అందిన ఈ అదనపు నిధులు, రాష్ట్రంలో చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులకు ఊతమిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# 53 వేల ఎకరాలకు గోదావరి జలాలు-జ్యోతుల నెహ్రూ,తుమ్మల బాబు

## --ఏలేరు ఆయకట్టుకు సాగునీటి విడుదల..రైతుల్లో హర్షం

**కాకినాడ జిల్లా ఆగస్టు 02(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** జగ్గంపేట,పిఠాపురం నియోజకవర్గాల పరిధిలోని 53 వేల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలు చేరాయి.గోదావరి ఎడమ కాలువ ప్యాకేజీ-3 నుంచి ఏలేరు ప్రధాన కాలువకు నీటిని అనుసంధానించి కిర్లంపూడి, పెద్దాపురం, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లోని బ్రాంచ్ కాలువలకు ఆదివారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు నీటిని విడుదల చేశారు.కిర్లంపూడి మండలం కృష్ణవరం వద్ద గోదావరి తల్లికి,ఏలేరు కాలువకు ప్రత్యేక పూజలు,హారతులు నిర్వహించిన అనంతరం నీటి విడుదల ప్రారంభించారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టిందని జ్యోతుల నెహ్రూ తెలిపారు.పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా 1,400 క్యూసెక్కుల గోదావరి జలాలను ఏలేరు ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తుండగా కృష్ణవరం వద్ద పోలవరం కాలువ నుంచి మరో 750 క్యూసెక్కుల నీటిని ఏలేరు ఆయకట్టు,పిఠాపురం బ్రాంచ్ కాలువకు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.దీంతో 53 వేల ఎకరాలకు సకాలంలో సాగునీరు అందడంతో వరి,ఉద్యాన పంటలకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు.ఏలేరు పరివాహక రైతులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసు కెళ్లిన వెంటనే నీటి సంఘాల ప్రతినిధులు ఇరిగేషన్ అధికా రులతో సమీక్ష నిర్వహించి నీటి విడుదలకు ఆదేశాలు ఇచ్చారని నెహ్రూ పేర్కొన్నారు. పోలవరం-ఏలేరు కాలువ అనుసంధానం పూర్త యితే జగ్గంపేట, పిఠా పురం ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందు తుందన్నారు.రైతు బాగుంటేనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని,వ్యవసాయమే అభివృద్ధికి వెన్నెముక అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు,జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్,ఏలేరు వైస్ చైర్మన్ ఊటా నానిబాబు, ఎంపీపీ తోట రవి,వీరవరం సొసైటీ అధ్యక్షుడు, తోట గాంధీ,జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ మెం బర్లు భూపాలపట్నం ప్రసాద్,చదరం చంటిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొదిరెడ్ల సుబ్బారావు, నాయకులు కొత్త కొండబాబు,నీలం శ్రీను,అనుకుల శ్రీకాంత్,పిఠాపురం జనసేన నాయకులు జ్యోతుల శ్రీనివాసరావు,దాసరి సీతారామకృష్ణ, బొదిరెడ్ల సుబ్బారావు,పాఠంశెట్టి మురళీకృష్ణ, ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు,నీటి సంఘాల ప్రతినిధులు, టీడీపీ,జనసేన నాయకులు, కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.



# కిర్లంపూడిలో కంబాల శ్రీనివాసరావు 6 వేల మంది మహిళలకు పట్టు చీరల పంపిణీ

**--కంబాలకు ఘన స్వాగతం పలికి పూలవర్షం కురిపించిన మహిళలు..**

**-- కంబాల కానుక,వనితల వేడుక కార్యక్రమంలో భాగంగా చీరలు పంపిణీ**

**-- శరకణం రాజబాబు అధ్యక్షతన కార్యక్రమం**

**కాకినాడ జిల్లా ఆగస్టు 02(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండల కేంద్రంలోని శ్రీ సత్యదేవ కళ్యాణ మండపంలో కంబాల కానుక-వనితల వేడుక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 6 వేల మంది మహిళలకు కంబాల శ్రీనివాసరావు ఉచితంగా పట్టు చీరలను పంపిణీ చేశారు.కిర్లంపూడికి విచ్చేసిన విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు,బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావుకు బీజేపీ మండల అధ్యక్షుడు శరకణం రాజబాబు,మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో మహిళలు ఘన స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు.ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రజలందరినీ కలుపుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.భారతీయ సంస్కృతి, సంప్రదా యాలు ఎంతో గొప్పవని,వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.మహిళామూర్తుల్లో హైందవ చైతన్యం తీసుకురావడం కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.మన దేశాన్ని విభజించి,పాలించాలనే ఉద్దేశంతో కొంతమంది స్వార్థప రులు అన్నదమ్ముళ్లా కలిసి ఉంటున్న మన మధ్య కుల, మతాల చిచ్చుపెట్టి విద్వే షాలను రెచ్చగొడుతు న్నార న్నారు.మన సంస్కృతి, సంప్రదా యాలను విదేశీయులు సైతం ఆచరిస్తున్నారని,మనం వాటిని విస్మరిస్తు న్నామన్నారు. మన భారతదేశం విశ్వగురువు అన్నారు. మనమందరం కలిసి కట్టుగా జీవించాలని పిలుపునిచ్చారు. అనంతరం సుమారు 6 వేల మంది మహిళలకు ఉచితంగా పట్టు చీరలను పంపిణీ చేశారు.అలాగే మాజీ మంత్రి,కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతి పట్ల కంబాల శ్రీనివాసరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేసి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి, రాజానగరం బీజేపీ మండల అధ్యక్షులు శరకణం రాజబాబు, ఆళ్ల శివ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కోనేటి శ్రీనివాసరావు,మండలం బీజేపీ ఇంచార్జ్ భీమశంకర్,కాకినాడ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లు అల్లు శివరామకృష్ణ,శరకణం కన్నారావు, బీజేపీ నాయకులు గంగరాజు,మండలం మహిళా మోర్చా అధ్యక్షురాలు తణుకు మంగాతయార్,ఓబీసీ మోర్చా అధ్యక్షులు పెంటకోట సత్యనారాయణ,యువ మోర్చా అధ్యక్షులు పడాల శివ,కోలా కృష్ణ,నైదాన రవి,బుద్ధ పెద్దకాపు,జనసేన నాయకులు గంధం ప్రభాకర్,చిక్కాల భగవాన్,ఏసుబాబు,ఎర్ర శైలజ, రామసేన సభ్యులు,బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత,అభిమానులు,కిర్లంపూడి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




# వరద ప్రభావిత గ్రామాలకు తక్షణ సహాయం అందించాలి

**మాజీ ఎంపీటీసీ పాయం సత్యనారాయణ డిమాండ్**

**కూనవరం ఆగస్టు 3, ప్రజా జ్యోతి** పోలవరం జిల్లా కూనవరం మండలంలో ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో అనేక గ్రామాలు ముంపునకు గురయ్యాయని, రహదారులు నీట మునిగిపోవడంతో గ్రామాలకు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి పూర్తిగా కనెక్టివిటీ కోల్పోయాయని మాజీ ఎంపీటీసీ పాయం సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని వరద ప్రభావిత గ్రామాల ప్రజలకు ప్రభుత్వం తక్షణమే నిత్యావసర వస్తువులు, తాగునీరు, వైద్య సేవలు, ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరదల కారణంగా అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుని రహదారులు నీట మునిగిపోవడంతో గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. మండలంలోని పెద్దార్కూరు, కూటూరు సచివాలయాల పరిధిలో ప్రత్యేక అధికారులను నియమించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన విమర్శించారు. వరదల సమయంలో క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించకపోవడంతో గ్రామాల్లో ప్రజల పరిస్థితి ఏమిటి, వారికి ఎలాంటి అవసరాలు ఉన్నాయో తెలుసుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందన్నారు. ఇప్పటికే సరైన వర్షాలు లేక రైతులు వరి నారుమళ్లను కూడా వేయలేక ఇబ్బందులు పడుతుండగా, ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో మండలంలోని అనేక గ్రామాలకు వెళ్లే రహదారులు నీట మునిగిపోయి గ్రామాల మధ్య పూర్తిగా కనెక్టివిటీ కోల్పోయిందని పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి సహాయక చర్యలు చేపట్టేందుకు అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, పెద్దార్కూరు, కూటూరు సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో గత రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు చిన్నపిల్లలు వృద్ధులు చీకట్లోనే గడపలు ఇచ్చిన పరిస్థితి వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడం వరదల వల్ల ప్రత్యేక అధికారులను నియమించకపోవడం బాధ్యత రహిత్యానికి నిదర్శనమని అన్నారు, విద్యుత్ పునర్దరించటంతోపాటు తక్షణమే ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కమిటీ నాయకులు నాగమణి మండల కార్యదర్శి బాబు బొర్రయ్య ఎంపీటీసీ ధర్మల అమ్మాజీ పాల్గొన్నారు.



## తెలుగు తమ్ముంల యెగక్షేమాలను అడిగి తెలుసుకున్న శ్రీమతి బీసీ ఇందిరారెడ్డి

**బనగానపల్లె:ఆగస్టు=02 ప్రజాజ్యోతి** కొలిమిగుండ్ల పర్యటన సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఎద్దుల వెంకటేశ్వర్లు గారి ఆహ్వానం మేరకు, వారి కుమార్తె మరియు అల్లుడు బాలచంద్రాయుడు గారి నివాసానికి శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి మర్యాదపూర్వకంగా విచ్చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి మాట్లాడుతూ, తెలుగు దేశం పార్టీ కార్యకర్తల సంక్షేమం, అభ్యు న్నతికి బీసీ కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి సేవలను ఎల్లప్పుడూ గుర్తించి ప్రోత్సహిస్తామని తెలిపారు.



## ఆలూరు ఎమ్మెల్యే వీరుపాక్షి అక్రమ అరెస్టు దారుణం

**గుంతకల్లు ఆగస్టు 2 (ప్రజా జ్యోతి):** ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి గ్రామం నందు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అక్రమ అరెస్టును నిరసరిస్తూ రాస్తారోక ధర్నా కార్యక్రమంకు హాజరైన వైస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే గాదిలింగప్ప కుమారుడు ఎన్. గాదిలింగేశ్వర బాబు (చిన్న బాబు) , కర్నూలు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనంతపురం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ముఖ్య నాయకులు, వైస్సార్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## మృతురాలికి నివాళులు అర్పించిన కాటసాని రామిరెడ్డి

**బనగానపల్లె:ఆగస్టు=02ప్రజాజ్యోతి** బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకులు యెన్నం లక్ష్మీరెడ్డి గారి భార్య యెన్నం పద్మ లీలావతి (వయసు 58 సంవత్సరాలు) అనారోగ్య కారణాలతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని వారి స్వగృహానికి వెళ్లి మృత దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఈకార్యక్రమంలోగ్రామ మాజీ సర్పంచ్ రమణ,ఎద్దుల సుబ్బారెడ్డి,గులాంనాభిపేట రామసుబ్బారెడ్డి, చిన్న వెంకట సుబ్బారెడ్డి,రాఘవ రెడ్డి,మల్లారెడ్డి, కే.వెంకట సుబ్బారెడ్డి ,సుధాకర్ (జాన్) తదితరు లుపాల్గొన్నారు.



## నియోజకవర్గ వ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్లు పనితీరు మెరుగుపరచుకోవాలి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుంతకల్లు ఆగస్టు 2 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి ఆదివారం తన క్యాంపు కార్యాలయం కసాపురం రోడ్డు నందుగల శ్రీ చక్ర అపార్ట్మెంట్స్ నందు గుంతకల్లు నియోజకవర్గం మూడు మండలాలకు సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్లతో ముఖ్యమైన సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు తమ పనితీరును మెరుగుపరుచు కోవాలని అక్కడక్కడ మీ మీద కొన్ని కంప్లైంట్ వచ్చిన కూడా మీరు క్షేత్రస్థాయిలో మెరుగైన ప్రదర్శన చేస్తున్న సందర్భంగా రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరికి గ్రామస్థాయిలో గాని మండల స్థాయిలో గాని అందుబాటులో ఉంటూ రాబోయే ఎన్నికల్లో మన అభ్యర్థి ఎవరైనా కూడా ఘనవిజయం సాధించే దిశగా అడుగులు వేయాల ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గం 3 మండలాల ఫీల్డ్ అసిస్టెంట్ లు కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగినది.

## స్వర్గీయ కాటసాని నాగార్జున రెడ్డి గారి జయంతి సందర్భంగా

**నీ రూపం అపురూపం నీ జ్ఞాపకాలు పదిలం మా ఇంటి వెలుగువు నీవు మా ఆశల వెలుగువు నీవు నీవు మా మధ్య లేకపోయిన నీ జ్ఞాపకాలు మా మధ్య సజీవం**

**బనగానపల్లె:ఆగస్టు=02ప్రజాజ్యోతి** బనగానపల్లె పట్టణంలోని స్వర్గీయ కాటసాని నాగార్జున రెడ్డి గారి ఘాట్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి కేక్ కట్ చేసిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి శ్రీమతి కాటసాని జయమ్మ.



## మంత్రి శ్రీ బీసీ జనార్దన్ రెడ్డి గారి పర్యటన వివరాలులి

**బనగానపల్లె:ఆగస్టు=02 ప్రజాజ్యోతి** నేడూఉదయం 09:00 గంటలకు కోయిల కుంట్ల మండలం పొట్టి పాడు గ్రామం నందు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ మరియు నూతన సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. లి కావున, ఈ కార్యక్రమా నికి ఎన్ డి ఎ కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మనవి చేస్తున్నాము.



## యాంకర్ శ్రీకాకుళం జిల్లా

**ఆమదాలవలస నియోజకవర్గం**

**పోలీస్ అధికారిని పై చింతాడ రవికుమార్ తీరు ఖండనీయం**

**- సభ్య సమాజం తలదించుకునేలా చింతాడ ప్రవర్తన**

**- విధుల్లో ఉన్న పోలీస్ అధికారికి కనీస గౌరవం ఇవ్వలేదు**

**- రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ**



శ్రీకాకుళం జిల్లా బూర్జ మహిళా ఎస్. ఐ ప్రవల్లిక పట్ల వైఎస్సార్సీపీ ఆమదాలవలస నియోజకవర్గం ఇంచార్జి చింతాడ రవికుమార్ ప్రవర్తించిన తీరు ఖండనీయమని రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ అన్నారు. పొందూరు మండల కేంద్రంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆమె విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చింతాడ రవికుమార్ ఒక మహిళా ఎస్. ఐ పట్ల అనుచితంగా ,సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించారన్నారు. విధి నిర్వహణ లో ఉన్న పోలీస్ అధికారికి కనీస గౌరవం ఇవ్వకుండా , అసభ్యకరంగా ప్రవర్తించడం సిగ్గు చేటు అని మండిపడ్డారు. వైఎస్సార్సీపీ నాయకులు ఇటువంటి ప్రవర్తనకు పాలపడం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్య అని విమర్శించారు. నిరంతరం ప్రత్యక్షంగానో , పరోక్షంగానో మహిళలను అవమానించేలా ప్రవర్తించడం చింతాడ రవికుమార్ కు కొత్తేమీ కాదన్నారు. అరెస్ట్ భయంతో పరార్ లో ఉండటం కాదని తప్పు చేయకపోతే చట్టం ముందు హాజరై చింతాడ తన నిర్దోషితత్వాన్ని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు పి లక్ష్మీ , అనూష ,టిడిపి మహిళా నాయకరాలు బలగ లలిత ,తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్సీపీ ఉద్యమ బాట

**బనగానపల్లె:ఆగస్టు=02**



**ప్రజాజ్యోతి** బనగానపల్లె నియోజకవర్గ టౌన్ హాల్ మీటింగ్ తేదీ: 03-08-2026 (సోమవా రం) సమయం: ఉదయం 9:00 గంటలకు స్థలం: బనగానపల్లె పట్టణ వైఎస్సార్సీపీ కార్యాలయం బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గారి ఆధ్వర్యంలో బనగానపల్లె నియోజకవర్గ టౌన్ హాల్ మీటింగ్ ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశానికి బనగానపల్లె నియోజకవర్గంలోని వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు, అన్ని అనుబంధ సంఘాల కన్వీనర్లు, సభ్యులు, సోషల్ మీడియా సభ్యులు మరియు పార్టీ శ్రేణులు అందరూ తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయవలసిందిగా కోరడమైనది.

## కొలిమిగుండ్లలో నాలుగు పునరుద్ధరణ బీసీ ఇందిరారెడ్డి

**బనగానపల్లె:ఆగస్టు,=02**



**ప్రజాజ్యోతి** పూర్వసంపద రక్షక సేన ఆధ్వర్యంలో సుమారు 1600 ఏళ్ల చారిత్రక వైభవాన్ని సంత రించుకున్న కొలిమిగుండ్ల గ్రామంలోని "నాలుగు గుళ్ల" పునరు ద్ధరణ కార్య క్రమం లో శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి పాలొ న్నారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి ఆలయ ప్రాంగణాన్ని స్వచ్ఛంగా శుభ్రపరిచి, మట్టితో రూపొందించిన శ్రీ వినాయకుడు మరియు శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వసంపద రక్షక సేన సభ్యులు, ప్రముఖ యూట్యూబర్ లక్ష్మీకాంత్, సెర్బియాకు చెందిన ప్రముఖ పర్యావరణవేత్త లాజర్, అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం విజయవంతం



**కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై కరపత్రాలను ప్రదర్శిస్తున్న తెదేపా నాయకులు,కార్యకర్తలు**

**ఎటపాక, ఆగస్టు 2 (ప్రజాజ్యోతి):** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాలు, రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీష భాస్కర్ సూచనల మేరకు ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని 284, 285, 286, 287 బూత్‌లలో ఆదివారం "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రతి ఇంటికి ప్రయోజనం చేకూరిందని, అందుకే ప్రజలు కూటమి ప్రభుత్వానికి సానుకూలంగా స్పందిస్తూ కార్యకర్తలకు స్వాగతం పలుకుతున్నారని నాయకులు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో కూటమి పాలనపై ప్రజల్లో రోజురోజుకూ విశ్వాసం పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఎటపాక మండల ప్రధాన కార్యదర్శి కణితి మధు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉండేటి రమేష్, గుగులోత్ శ్రీను, బాదావత్ స్వామి, బాదావత్ సూర్యం తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గోదావరి వరదల వేళ గర్భిణీలకు అండగా అన్నదానం





**కూనవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో 150 మందికి భోజన ఏర్పాట్లు**

**కూనవరం ఆగస్టు 3, ప్రజా జ్యోతి కూనవరం, ఆగస్టు 2: శనివారం** గోదావరి వరదల కారణంగా కూనవరం మండలంలోని 68 గ్రామాలకు రహదారి రాకపోకలు నిలిచిపోవడంతో, ముందస్తు జాగ్రత్త చర్యగా సుమారు 150 మంది గర్భిణీ స్త్రీలను జగ్గవరం కాలనీలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణీలకు ఈరోజు మరియు రేపు భోజన సౌకర్యాన్ని అరుణాచల స్వామి ఆధ్వర్యంలో అన్నదానంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్, డాక్టర్ తేజ, జోగారావు, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు నోముల రామారావు, బీజేపీ సామాజిక కార్యకర్త గేద శ్రీనివాసరావు పాల్గొని గర్భిణీలకు అన్నదానం పంపిణీ చేశారు. వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న గర్భిణీలకు ఆహారం, వైద్య సేవలు అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

# జగన్మోహన్ రెడ్డి జన సునామీని పక్కదారి పట్టించేందుకే మహిళా ఎస్సై దాడి ఓ నాటకం

**- కూటమి ప్రభుత్వం వారి స్వార్ధ రాజకీయాల కోసం మహిళా ఉద్యోగిని గౌరవానికి భంగం కలిగిస్తుంది**

**- ఎమ్మెల్యే మీడియా ముందు ఏకపాత్రాభినయం చేయడం హాస్యాస్పదం**

**- మహిళలను కించపరచడం టిడిపి నాయకులకు అలవాటే**

**- కూటమి నాయకులు చేస్తున్న వాక్యాలు అసమర్థత, అసూయకు నిదర్శనం**

**- కూటమి అరాచకానికి ప్రజలే బుద్ధి చెప్తారు**

**- రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్**



**ఆమదాలవలస , ప్రజాజ్యోతి న్యూస్:** వైఎస్సార్సీపీ పార్టీ అధినేత , మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన సునామీని పక్కదారి పట్టించేందుకు మహిళా ఎస్. ఐ పై దాడి చేశారంటూ కూటమి నాయకులు చేస్తున్న ఆరోపణలు ఓ నాటకం అని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలో పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలంటే కనీస గౌరవం లేని ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని అన్నారు.కూటమి ప్రభుత్వం వారి స్వార్ధ రాజకీయాల కోసం మహిళా ఉద్యోగిని బలి పశువుని చేస్తున్నారని ఆరోపించారు.12:30 గంటల సమయం లో ఘటన జరిగితే సాయంత్రం ఐదు గంటల వరకు ఎస్. ఈ ప్రవల్లిక విధి నిర్వహణలో ఉన్నారని , అసభ్యకరంగా ఎవరైనా ప్రవర్తిస్తే ఆమె అంత సమయం విధుల్లో ఉండేవారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మీడియా ముందు ఏకపాత్రాభినయం చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు . ఏమీ జరగని దాన్ని జరిగిందని అక్కడ పట్టుకున్నారు, ఇక్కడ పట్టుకున్నారు అంటూ ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని , ఆ మాటలకు ఆ మహిళ ఎంత శోభ అనుభవిస్తుందో ఆలోచించారా అని ప్రశ్నించారు. మహిళా ఎస్సై 12:30 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విధులు నిర్వహిస్తుండగా తనకు తెలియకుండానే మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం ఆమే ఆశ్చర్యపోయిన పరిస్థితిని కల్పించిందన్నారు .కూటమి ప్రభుత్వ తీరు విజయశాంతి నటించిన సినిమాలో దుర్నీతి లోకంలో మరో చరిత్ర అంటూ... పాడిన పాట గుర్తుకొస్తుందన్నారు.ఇంతలా శోభకు గురి చేస్తూ కూన రవికుమార్ నేడు సుద్దులు నీతులు మాట్లాడు తున్నా రన్నారు. ప్రతిపక్షంలో ఉన్న పుడు సీఐ ప్రసాద్ రావుని దుర్భాషలాడిన సంద ర్భాన్ని వీడియో మీడియా కీ ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.రాజకీయం చేయ డానికి ఇది సందర్భం కాదని సోదర సమానురాలైన మహిళను లాగటం సమంజసమా అని రమేష్ కుమార్ ప్రశ్నించారు. కావాలంటే మేము రోడ్డుపై వెళ్తున్నప్పుడు బెదిరించామనికేసు పెట్టుకోవాలని, అంతేకానీ మహిళలని కించపరచడం ఇదెక్కడి దుర్నీతని మండిపడ్డారు. మహిళలని కించపరచడం మీ అధినాయకత్వానికి అలవాటేనని, మీ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి లక్ష్మీపార్వతినే కించపరిచారని గుర్తు చేశారు. వైసిపి సమన్వయకర్తను చింతాడ సంతగాడంటూ సంబోధిస్తున్న తీరు అత్యంత జుగుప్సాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.కాఫీ కూడా అలవాటు లేని వ్యక్తిని పట్టుకొని గంజాయి సేవిస్తాడు గంజాయి లేకుండా బయటికి రాడు అంటూ మీరు చేస్తున్న వ్యాఖ్యలు మీ అసమర్థతకు అసూయకు నిదర్శనంఅని అన్నారు . గంజాయి బ్యాచ్ అని మీరు అన్న మాటలకు కూటమి ,వైసీపీ నాయకులు రక్త పరీక్షలు చేయించుకుందామని , ఏ రక్త పరీక్షకు అయినా సిద్ధమని సవాల్ విసిరారు. మనమంతా పరీక్ష చేసుకుంటే ఎవరు గంజాయి బ్యాచ్ ప్రజలకు తెలిసిపోతుందని ఎద్దేవా చేశారు. ప్రత్యర్థి బలవంతుడైనప్పుడే వ్యక్తిత్వ హననానికి పాల్పడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమదాలవలస ఎంపీపీ ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి , పొందూరు జెడ్పీటీసీ లోలుగు కాంతారావు,జిల్లా అధికార ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్,పొందూరు మండల పార్టీ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి,సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షులు ఎవరు మల్లేశ్వరరావు ,బూర్జ మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, ఇతర వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రజా, రైతాంగ, వ్యవసాయ, కార్మిక, సమస్యల పై ఇంటింటికి సిపిఐ నాయకులు కార్యక్రమం



**గుంతకల్లు ఆగస్టు 2 (ప్రజా జ్యోతి):** ప్రజా, రైతాంగ, వ్యవసాయ, కార్మిక, సమస్యల పై ఇంటింటికి సిపిఐ కార్యక్రమం ఆదివా రం సిపిఐ నాయకులు మండలంలోని దోని ముక్కల, మల్లెనపల్లి, పులిగుట్టపల్లి, నేల్లగొండ గ్రామాల్లో ఉపజాత సందర్భం గా ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం మానికి సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామాంజనేయు లు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్ర స్వామి సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్ ఎం డి గౌస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దేవేంద్ర ఏఐటియుసి మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, రైతు సంఘం మండల నాయకులు ఉమర్ భాష ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ గుంతకల్లు మండలానికి తలమాని మైనది ఆంధ్రనివా కాలువ సిపిఐ మండల పార్టీ ఆధ్వర్యంలో 2017 నుండి నీటి వరకు అనేక రూపాల లో అలుపెరుగని పోరాటం చేస్తూ ఉంది రాగులుపాడు దగ్గర ఉపకాలవ ఏర్పడితే 20 గ్రామాలకు సాగునీరు తాగునీరు అందుతాయని మరి ఈ మధ్యన గ్రామ రైతులతో పది రోజులు నిరాహార దీక్షలు చేపట్టడం ఫలితంగా గుంతకల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వచ్చి జులై నాటిక అంతా ఉపకాలవ పనులు ప్రారంభి స్తామని హామీ ఇవ్వడం జరిగింది. కానీ నేటికీ జరగలేదు మరియు హెచ్.ఎల్.సి కెనాల్ ను కాలవను మరమ్మత్తు చేసి ఆధునీకరణంగా చివరి వరకు హెచ్ ఎల్ సి కెనాల్ నీరు అందేటట్లు చూడాలని అదేవిధంగా ఎన్నికలలో సందర్భంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు 50 సంవత్స రాలు నిండిన వారికి నెలకు 4000 పింఛన్లు ఇస్తానని శ్రీనిధి కింద 18 సంవత్సరా ల నుండి 59 సంవత్సరాల వరకు నెలకు 1500 రూపాయలు ఆర్థిక సహాయం చేస్తానని నిరుద్యోగులకు నెలకు 3000 రూపాయలు మృతి ఇస్తానని చేనేత కార్మికులకు సంవత్సరానికి 36 వేల రూపాయలు హార్దిక సహాయం చేస్తానని ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇస్తామని ఇలా అనేకమైనటువంటి హామీలు ఇవ్వడం జరిగింది హామీల సాధన కొరకు ఈ నెల 17న కలెక్టరేట్ కార్యాలయం దగ్గర పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించ డం జరగబోతుంది కావున గ్రామంలోని రైతులు రైతు కూలీలు యువత విద్యార్థి కార్మికులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని నాయకులు పిలుపునివ్వ డం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి బీసీ కుల్లాయప్ప, మండల కార్యదర్శి పుల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు అంజి, కిరణ్ షేక్ షబ్బీర్ భాష ప్రకాష్ నాయకులు నందు ఏఐటియుసి నాయకులు పాల్గొనడం జరిగింది.

# పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కి రూ.10 వేల ప్రోత్సాహక బహుమతి అందజేసిన.

**మెడికల్ స్టోర్, రవి మిత్ర బృందం..**

**కంబదూరు, ఆగస్టు 2:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కుమారి సాయి దివ్యకు పాఠశాల 1986--87 పదవ తరగతి పూర్వ విద్యార్థులు, మెడికల్ స్టోర్ రవి, మిత్రబృందం ఆధ్వర్యంలో రూ.10 వేల నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నాగభూషణ, సికిందర్ తదితరులతో పాటు ట్యూషన్ మాస్టర్ రామాంజినేయులు, మారుతి కాన్వెంట్ కరస్పాండెంట్ సురేంద్ర, ఉపాధ్యాయుడు హనుమంతరాయుడు, హైస్కూల్ కమిటీ చైర్మన్ రాజు పాల్గొని విద్యార్థినికి నగదు బహుమతిని అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యలో మరింత రాణించేందుకు ఇటువంటి ప్రోత్సాహకాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మెడికల్ స్టోర్ రవి, మిత్రబృందం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం చేయూతనందిస్తూ, ఉడతా భక్తితో విద్యాభి వృద్ధికి సహకరిస్తున్న రవి మిత్రబృందం మండలానికి ఆదర్శంగా నిలుస్తోందని పలువురు ప్రశంసించారు.



# వైభవోపేతంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు

-మొదటిపేజీ తరువాయి

వేడుకున్నట్లు వివరించారు. భక్తులకు మహంకాళి అమ్మవారు దేదీప్యమానంగా దర్శనం ఇస్తున్నారు.

**భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు**

తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించేందుకు ఉజ్జయిని మహంకాళి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆరు క్యూలైన్లను ఏర్పాటు చేసి అమ్మవారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నారు. బోనంతో వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో 2,500 మంది పోలీసులతో భద్రతను ఏర్పాటు చేశారు. 500 మంది ప్రత్యేక వాలంటీర్లు సేవలందిస్తున్నారు. బోనాల సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు.

**బోనాలకు సంబంధించి మరింత సమాచారం :**

ఇవాళ, రేపు సికింద్రాబాద్‌లో బోనాల జాతర

ఇవాళ బోనాలు, రేపు అమ్మవారి రంగం భవిష్యవాణి కార్యక్రమం

లష్కర్ బోనాలకు ఇబ్బందులు లేకుండా దేవదాయశాఖ ఏర్పాట్లు

లష్కర్ బోనాలకు వచ్చే భక్తుల కోసం 6 క్యూలైన్లు

బోనం ఎత్తుకుని వచ్చేవారికి ప్రత్యేకంగా రెండు క్యూలైన్లు

ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

శివశక్తులకు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3 వరకు సమయం కేటాయింపు

ఇవాళ రాత్రి, రేపు రాత్రి అమ్మవారి ఫలహార బండ్ల ఊరేగింపు

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సజ్జనర్ : సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయన, అమ్మవారికి పట్టు వస్త్రాలు, బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో చేపట్టిన



భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నగర సీపీ సజ్జనర్ మీడియాతో మాట్లాడుతూ భాగ్యనగరంలో ఆషాఢ బోనాల పండుగకు ఘనమైన చారిత్రక నేపథ్యం ఉందన్నారు. ప్రస్తుతం నగరవ్యాప్తంగా ఉత్సవాలు అత్యంత ప్రశాంత వాతావరణంలో, భక్తి శ్రద్ధలతో సాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే గోల్కొండ, బల్కంపేట బోనాల జాతరలు ప్రశాంతంగా ముగియగా, ప్రస్తుతం ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజా అమ్మవార్ల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని వివరించారు. భక్తుల భద్రత, రక్షణే ధ్యేయంగా హైదరాబాద్ సిటీ పోలీస్ శాఖ పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు.

**తొలిసారిగా ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్**

ఉజ్జయిని మహంకాళి బోనాల వేడుకలకు దాదాపు 2,500 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీపీ సజ్జనర్ తెలిపారు. ఉత్సవాల్లో ఏటా పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని తొలిసారిగా ఏఐ ఆధారిత క్రౌడ్ మేనేజ్‌మెంట్, నిఘా వ్యవస్థను మహంకాళి ఆలయం వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అత్యాధునిక ఏఐ వ్యవస్థ ద్వారా ఆలయ పరిసరాల్లోని సీసీటీవీ కెమెరాలతో ముఖాలను విశ్లేషించే 'ఫేషియల్ రికగ్నిషన్' సాంకేతికతను ఉపయోగిస్తున్నామన్నారు. దీనివల్ల పాత నేరస్థులు, గొలుసు దొంగలు, జేబుదొంగలను తక్షణమే గుర్తించి అప్రమత్తమయ్యే వెసులుబాటు కలుగుతుందని తెలిపారు.

**తొక్కిసలాటలు జరగకుండా చర్యలు**

అలాగే ఆలయంలోకి వచ్చే, వెళ్లే భక్తుల సంఖ్యను క్యూ మేనేజ్‌మెంట్ ద్వారా కచ్చితంగా లెక్కిస్తామని సీపీ సజ్జనర్ పేర్కొన్నారు. ఆలయం లోపల వివిధ విభాగాలు, క్యూ లైన్లలో భక్తుల రద్దీ సాంద్రతను 'థ్రెషోల్డ్ మ్యాపింగ్' ద్వారా నిరంతరం విశ్లేషిస్తూ, పరిమితికి మించి రద్దీ పెరిగితే ముందస్తు చర్యల ద్వారా తొక్కిసలాటలు జరగకుండా నివారిస్తామని స్పష్టం చేశారు. బోనాల ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, తదితర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటున్నామని వివరించారు. భక్తులందరూ ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకోవాలని, జాతర విజయవంతంగా పూర్తయ్యేలా పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు.

# శిశువు ఆరోగ్యానికి తల్లిపాలు తొలి పెట్టుబడి

## ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు

ప్రపంచ తల్లిపాల వారోత్సవం సందర్భంగా కిమ్స్ కడిల్స్ (కొండాపూర్) వారం రోజుల పాటు తల్లిపాల ప్రాధాన్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. తల్లిపాలపై అవగాహన పెంచడంతోపాటు తల్లులకు కుటుంబ సభ్యులు, వైద్యులు, సమాజం నుంచి అవసరమైన సహకారం అందేలా చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఇప్పటికే ఫలితాలిచ్చిన విధానాలను మరింత బలోపేతం చేయడంతో పాటు వైద్యులు, కుటుంబ సభ్యులు, కార్యాలయాలు, సమాజం కలిసి తల్లులకు అండగా నిలవాల్సిన అవసరంపై అవగాహన కల్పిస్తున్నారు. తల్లిపాల విశిష్టతను ప్రజల్లో అవగాహన పెంచడానికి ఆదివారం వాక్ థాన్ చేపట్టారు.



**కుటుంబం, సమాజం బాధ్యత**

ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన తల్లిపాల అవగాహన వాక్ థాన్‌లో ప్రసూతి వైద్యులు, నియోనటాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యులు, నర్సులు, లాక్టేషన్ కన్సల్టెంట్లు, ఆస్పత్రి సిబ్బంది, గర్భిణులు, చిన్నారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తల్లిపాలు ఇవ్వడం తల్లి ఒక్కరి బాధ్యత మాత్రమే కాదని కుటుంబం, సమాజం కూడా అందుకు సహకరించాలని ఈ సందర్భంగా సందేశం ఇచ్చారు.

**ప్రత్యేక కార్యక్రమాలు**

వారం రోజుల పాటు గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు తల్లిపాలపై శాస్త్రీయ అవగాహన కల్పించే పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గర్భధారణ సమయంలో తల్లిపాలపై కౌన్సెలింగ్, శిశువుకు సరైన విధంగా పాలు పట్టించే పద్ధతులపై ప్రత్యక్ష ప్రదర్శనలు, వైద్యుల కోసం సీఎంఈ కార్యక్రమాలు, క్విజ్ పోటీలు, తల్లిపాలపై ఉన్న అపోహలను నివృత్తి చేసే ప్రత్యేక సమావేశాలు, లాక్టేషన్ అంశంపై స్కిట్ పోటీలు నిర్వహిస్తున్నారు. పుట్టిన తర్వాత తొలి ఆరు నెలలు శిశువుకు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువకాలం తల్లిపాలు కొనసాగించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

**శిశువు ఆరోగ్యానికి తల్లి పాలు తొలి పెట్టుబడి**

ఈ సందర్భంగా తెలంగాణ యూనిట్స్ నియోనటాలజీ అకడామిక్స్, రీసెర్చ్ రీజినల్ డైరెక్టర్ నియోనటాలజీ విభాగాధిపతి, కిమ్స్ కడల్స్, కొండాపూర్ డాక్టర్? అపర్ణ మాట్లాడుతూ 'శిశువు ఆరోగ్యానికి తల్లి పాలు తొలి పెట్టుబడి. ఇవి శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంచి, మెదడు ఎదుగుదలకు దోహదపడతాయి. అలాగే తల్లీబిడ్డల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయి. చాలామంది తల్లులు పాలు ఇవ్వాలని కోరుకున్నప్పటికీ సరైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అవసరం అవుతుంది. ప్రతి తల్లి ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో తన బిడ్డకు తల్లిపాలు అందించేలా సమాజంలో సహాయక వాతావరణాన్ని ఏర్పరచడమే ఈ కార్యక్రమం లక్ష్యం' అని అన్నారు.

**సరైన అవగాహన, సాధన అవసరం**

కిమ్స్ కడల్స్ లాక్టేషన్ కన్సల్టెంట్ అర్చనా రెడ్డి మాట్లాడారు. 'సరైన సమాచారం, నిపుణుల మార్గదర్శకత్వం అందితే చాలా మంది తల్లులు ఎదుర్కొనే తల్లిపాల సమస్యలను అధిగమించవచ్చు. కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది నుంచి లభించే ప్రోత్సాహం తల్లిపాల విజయవంతమైన కొనసాగింపులో కీలక పాత్ర పోషిస్తుంది. తల్లిపాలు ఇవ్వడం సహజ ప్రక్రియే అయినప్పటికీ, సరైన అవగాహన, సాధన, మద్దతు కూడా అంతే అవసరం' అని తెలిపారు.

**ప్రతి తల్లికి సమాజం అండగా**

కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఛైర్మన్ a మేనేజింగ్ డైరెక్టర్ డా. బి.భాస్కర్ రావు మాట్లాడుతూ, 'తల్లిపాలు తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే అత్యంత ప్రభావవంతమైన, తక్కువ ఖర్చుతో కూడిన ప్రజారోగ్య చర్యల్లో ఒకటి. గర్భధారణ దశ నుంచి ప్రసవానంతరం వరకు ప్రతి తల్లికి సరైన మార్గదర్శకత్వం అందించడం ఆస్పత్రుల బాధ్యత. కిమ్స్ కడల్స్‌లో శాస్త్రీయ వైద్య సేవలు, నిపుణుల సలహాలు, నిరంతర అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రతి తల్లి ఆత్మవిశ్వాసంతో తల్లిపాలు ఇవ్వడానికి అవసరమైన సహకారాన్ని అందిస్తున్నాం' అని పేర్కొన్నారు. తల్లిపాలపై అవగాహన పెంపొందించడం, తల్లులు నవజాత శిశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ప్రతి తల్లికి సమాజం అండగా నిలిచే వాతావరణాన్ని సృష్టించడం కోసం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

## మారుతున్న రాజకీయం

-మొదటిపేజీ తరువాయి

పాదయాత్రల యుగానికి ప్రత్యామ్నాయం వచ్చిందా? తెలుగు రాష్ట్రాల్లో గత రెండు దశాబ్దాలుగా పాదయాత్రలు రాజకీయ విజయానికి కీలక వ్యూహంగా నిలిచాయి. 2003లో వై.ఎస్. రాజశేఖర రెడ్డి చేపట్టిన పాదయాత్ర, ఆ తర్వాత చంద్రబాబు నాయుడు నిర్వహించిన "వస్తున్నా మీ కోసం", వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన "ప్రజా సంకల్ప యాత్ర" వంటి కార్యక్రమాలు రాజకీయంగా పెద్ద మైలురాళ్లుగా నిలిచాయి. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడానికి ఇవి సమర్థమైన వేదికలుగా మారాయి.

**ఇప్పుడు ఎందుకు మారింది?**

అయితే ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సోషల్ మీడియా విస్తరణతో నాయకుడు ఒక గ్రామంలో చేసిన కార్యక్రమం క్షణాల్లోనే లక్షల మందికి చేరుతోంది. దీంతో ప్రజలను కలవడానికి పాదయాత్ర ఒక్కటే మార్గం కాదనే భావన బలపడుతోంది. ఇక ప్రజల అంచనాల్లో కూడా మార్పు కనిపిస్తోంది. "ఎంత నడిచారు?" అనే ప్రశ్న కంటే "ఏం చేశారు?" అనే ప్రశ్నకు ఇప్పుడు ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోంది. ముఖ్యంగా యువత ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, విద్య వంటి అంశాలపై నాయకుల చర్యలను గమనిస్తోంది. అందుకే రాజకీయ నాయకులు కూడా సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో నిరంతర ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

**కొత్త రాజకీయ ఆయుధాలు**

ఇటీవలి కాలంలో మెగా జాబ్ మేళాలు, ఉచిత వైద్య శిబిరాలు, మహిళా సంఘాలతో సమావేశాలు, రైతు అవగాహన సదస్సులు, స్కిల్ ట్రైనింగ్ క్యాంపులు, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు వంటి కార్యక్రమాలు విస్తృతంగా కనిపిస్తున్నాయి. ఇవి ఏ ఒక్క పార్టీకి మాత్రమే పరిమితం కాకుండా వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు అమలు చేస్తున్న కార్యక్రమాలుగా మారుతున్నాయి.

**పెరుగుతున్న డిజిటల్ కమ్యూనికేషన్**

అదే సమయంలో ప్రచార విధానంలో కూడా గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఒకప్పుడు పోస్టర్లు, భారీ బహిరంగ సభలు ప్రధాన ప్రచార సాధనాలైతే, ఇప్పుడు రీల్స్, షార్ట్ వీడియోలు, లైవ్ స్ట్రీమింగ్, డిజిటల్ కమ్యూనికేషన్ కీలక పాత్ర పోషిస్తున్నాయి. స్థానిక స్థాయిలో చిన్న సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలతో నిరంతర సంబంధాన్ని కొనసాగించే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. అయితే రాజకీయ విజయాన్ని ఒక్క అంశంతోనే ముడిపెట్టలేమని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. పార్టీ బలం, అభ్యర్థి వ్యక్తిత్వం, స్థానిక పరిస్థితులు, ప్రభుత్వ పనితీరు, ఎన్నికల సమయంలో నెలకొనే రాజకీయ వాతావరణం వంటి అనేక అంశాలు కలిసి ఫలితాలను ప్రభావితం చేస్తాయి.

**భవిష్యత్ రాజకీయాలు!**

2029 ఎన్నికల్లో మరోసారి భారీ పాదయాత్రలే ప్రధాన అస్త్రంగా మారతాయా? లేక జాబ్ మేళాలు, సేవా కార్యక్రమాలు, డిజిటల్ కమ్యూనికేషన్, ప్రజలతో నిరంతర అనుబంధమే కొత్త రాజకీయ ఫార్ములాగా నిలుస్తుందా? దీనికి సమాధానం భవిష్యత్తులోనే తేలనుంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది... ప్రజలతో అనుసంధానమయ్యే పద్ధతులు మారుతున్నాయి... వాటికి అనుగుణంగా రాజకీయాలు కూడా కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయి.

## రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు

-మొదటిపేజీ తరువాయి

శాతం సగటు లోటు నమోదైంది. ఈ 2 నెలల్లోనే 357.7 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉన్నప్పటికీ, 339.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే కురిసింది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రానికి ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ఆగమనం ఆలస్యమైంది. వర్షానికి, వర్షానికి మధ్య తీవ్ర అంతరం ఏర్పడిన కారణంగా జూన్‌లో 12 శాతం లోటు నమోదవ్వగా, జులైలోనూ భారీగా వర్షపాత లోటు ఏర్పడుతుందని మొదట్లో అంచనా వేశారు. అనుకోకుండా ఒడిశా-బంగాల్ తీర ప్రాంతాల్లో ఏర్పడిన వాయుగుండం ఛత్తీస్‌గఢ్‌పై నుంచి ప్రయాణించడం, దానికి అనుబంధంగా ద్రోణి ఏర్పడటంతో ఆ ప్రభావం తెలంగాణ రాష్ట్రంపై పడింది.

**అధిక వర్షపాతం ఉన్న జిల్లాలు**

24వ తేదీ తరువాత ఉత్తర భాగంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. మంచిర్యాల జిల్లాలో 26 శాతం అధికంగా, జగిత్యాల 23, కామారెడ్డి 21, పెద్దపల్లి 21, మెదక్ 17, రంగారెడ్డి 17, ఆసిఫాబాద్ 15, ములుగు 7, నిర్మల్ జిల్లాలో 6 శాతం అధికంగా వర్షపాతాలు నమోదయ్యాయి.

**లోటు వర్షపాతం ఉన్న జిల్లాలు**

హనుమకొండ -45 శాతం, జనగామ -44, వరంగల్ - 37, సూర్యాపేట - 36, ఖమ్మం - 36, యాదాద్రి - 34, వనపర్తి - 30, గద్వాల జిల్లాలో - 29 శాతం లోటు వర్షపాతం కొనసాగుతోంది. జూన్ 1వ తేదీ నుంచి జులై 31 వరకు 61 రోజులకు (రెండు నెలలకు) గానూ ఇప్పటికి 33 రోజులే వర్షం పడింది. మొత్తం 621 మండలాలకు 253 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. 119 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. 235 మండలాల్లో లోటు, మరో 14 మండలాల్లో అధిక లోటు ఉందని అధికారులు చెబుతున్నారు.

**విస్తరిస్తున్న పంటల సాగు**

రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలతో పంటల సాగు విస్తరించింది. మొత్తం 1,32,38,446 ఎకరాలకు గానూ 85,38,203 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. పత్తి పంట సాగు మొత్తం విస్తీర్ణంలో 98 శాతానికి పెరిగింది. వరి పంట 22.86 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వానాకాలం సీజన్ ఆరంభం నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొనగా, పంటల సాగుపై రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో గత 10 రోజులుగా కురుస్తున్న వర్షాలతో మొలకెత్తే దశలో ఉన్న పత్తి నిలదొక్కుకుంది. చెరువులు, కుంటల్లోకి చేరిన వరద నీటితో పత్తి పంటకు మరో 2 నెలల వరకు ఎలాంటి సమస్య లేదని అధికారులు వివరిస్తున్నారు. మరోవైపు రైతులు వరి నాట్లు వేస్తున్నారు. వరి స్వల్పకాలిక రకాలు వేస్తేనే ఫలితం ఉంటుందని, పప్పు ధాన్యాలు, నూనె గింజల పంటలు సైతం పండేందుకు వీలుందని అధికారులు చెబుతున్నారు. గతేడాది ఇదే సమయానికి 89,16,058 ఎకరాల్లో పంటలు వేయగా, ఈ ఏడాది 3,77,833 లక్షల ఎకరాలు తక్కువగా ఉంది. అదే సమయంలో మరికొన్ని జిల్లాల్లో లోటు వర్షపాతం ఉంది.

## హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం

-మొదటిపేజీ తరువాయి

వర్షం కురిసింది. నగరంలోని గాంధీనగర్, కవాడిగూడ, దోమలగూడ, భోలక్‌పూర్, అంబర్‌పేట, కాచిగూడ, బర్కత్‌పురా, నల్లకుంట, సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, ప్యాట్నీ, పారడైజ్, మారేడుపల్లి, చిలకలగూడ, బేగంపేట ప్రాంతాల్లో వాన కురిసింది. వర్షం కారణంగా అనేక ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ప్రవహించింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. నీరు నిలిచిన ప్రాంతాల్లో హైడ్రా, మాన్‌సూన్ టీమ్స్ రంగంలోకి దిగాయి.? రోడ్లపై నిలిచిన నీటిని తొలగించే చర్యలు చేపట్టాయి. ట్రాఫిక్?కు ఎలాంటి అవాంతరాలు కలగకుండా చర్యలు తీసుకున్నాయి. ఎండగా ఉందని స్నేహితులతో బయటకు వస్తే ఒక్కసారిగా వర్షం పడటంతో గంట కాలంపాటు మెట్రో పిల్లర్ల వద్దనే తలదాచుకున్నట్లు స్థానికులు చెప్పారు.

**రోడ్లపైనే వరద నీరు ప్రవాహం**

కాగా వారం రోజుల కిందట కురిసిన వానలు నగర వాసులను ఇబ్బందులకు గురిచేశాయి. ఈ వర్షాల కారణంగా అనేక చోట్ల రోడ్లన్నీ జలమయమయ్యాయ్యి. మరీ ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపైనే వరద నీరు ప్రవహించింది. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్?కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాఠశాలలు, కార్యాలయాలు విడిచే సమయం కావడంతో వారంతా ఇళ్లకు చేరేందుకు అవస్థలు పడ్డారు. కాగా హైటెక్? సిటీ ప్రాంతంలో ఏకంగా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రజలంతా నగరంలోని మెట్రో స్టేషన్లను ఆశ్రయించారు. అధిక సంఖ్యలో ప్రయాణికులు చేరడంతో ప్లాట్‌ఫారాలు రద్దీగా మారాయి. దీంతో ఒక్కసారిగా స్టేషన్లన్నీ జనంతో కిక్కిరిశాయి. ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులతో స్టేషన్?లన్నీ కిటకిటలాడాయి. రైళ్లు వచ్చిన వెంటనే పూర్తిగా నిండిపోయాయి.

# 16వ వార్డులో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం

**ముఖ్య అతిథులుగా మంచూరు, హరి ప్రసాద్ హాజరు**





**బద్వేలు స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 2 (ప్రజా జ్యోతి)** బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు సుమిత్ర నగర్‌లో 16వ వార్డు ఇంచార్జ్ లకిడి విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో "ఇంటింటికి కూటమి ప్రభుత్వం -- సంక్షేమ విజయాలు" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి మరియు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు హరిప్రసాద్ గారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు కార్యక్రమంలో భాగంగా వార్డు పరిధిలో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి నేతలు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పంపిణీ చేశారు. ప్రజలను కలుసుకుని వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అందించిన ఫలితాలను ప్రజలకు నేరుగా తెలియజేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. గత రెండేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగంగా జరిగాయని, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల విస్తరణ, ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వం విశేష పురోగతి సాధించిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడమే కాకుండా, ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరేలా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తూ ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. బద్వేలు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కుటుంబ సాధికార సమితి సభ్యులు, మహిళలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన వ్యక్తి పాలెం గంగయ్య





**- బద్వేలు ఎంఈఓ ఎస్.మల్లిక, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయ కుమార్.**

**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 2 (ప్రజా జ్యోతి)** 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ, ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి పాలెం గంగయ్య అని, బద్వేల్ మండల విద్యాశాఖ అధికారి ఎస్.మల్లికా యుటియఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం బద్వేలులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బద్వేలు మండల విద్యాశాఖాధికారి ఎస్.మల్లిక అధ్యక్షతన ఏర్పాటు చేసిన బద్వేల్ మండల పరిధిలోని, బంకపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు పాలెం గంగయ్య పదవీ విరమణ సన్మాన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎస్.మల్లిక, మాదన విజయకుమార్ మాట్లాడుతూ వృత్తి పట్ల అంకిత భావం, సమయపాలన, క్రమశిక్షణ, ఓర్పుగా నేర్పుగా పనిచేసే వ్యక్తిత్వం పాలెం గంగయ్యకే స్వంత మన్నారు. 30 సంవత్సరాలు విద్యా క్షేత్రంలో ఉపాధ్యాయునిగా పనిచేసి ఎంతోమందిని ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఘనత పాలెం గంగయ్య కే దక్కుతుందన్నారు. వృత్తిపట్ల నిబద్ధత కలిగిన ఉపాధ్యాయునిగా ముందుకు సాగుతూ ఎంతోమంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. నేటి తరం ఉపాధ్యాయలోకం పాలెం గంగయ్య లాంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు పాలెం గంగయ్య పదవీ విరమణ ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని, మృదు స్వభావిగా, స్నేహశీలిగా పేరుపొందిన పాలెం గంగయ్య అజాతశత్రువుగా నిలిచాడన్నారు. ఆయన పదవీ విరమణ అనంతరం కూడా సామాజిక కార్యక్రమాల్లో ఆయన కార్యక్రమంలో పాలుపంచుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, ప్రధానోపా ధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.వెంకటసుబ్బారెడ్డి, బి.కోడూరు మండల విద్యాశాఖాధికారి ఎం.సునీల్ కుమార్, ఎస్టీయూ నాయకులు ఎస్.వెంకట సుబ్బారెడ్డి, పిఆర్టీయూ నాయకులు సంజీవరెడ్డి, ఆపస్ నాయకులు నందకిషోర్ రెడ్డి , చిన్న కేశంపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.పెంచలయ్య, విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ రఘురామయ్య, సన్మాన కమిటీ నాయకులు టి.శివ ప్రసాద్, బి.థామస్, కె.సుధాకర్, ఓసూరి విజయ భాస్కర్, శ్రీనివాసులు, గురు శేఖర్, శివశంకర్ రెడ్డి, వెంకటేశ్వర రాజు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి గారు మహాలక్ష్మి పథకం ఎప్పుడు అమలు చేస్తారు





**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 2 (ప్రజా జ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఊరు వాడ తిరుగుతూ మహిళలకు అనేక హామీలు ఇచ్చారని తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఇస్తామన్నా మహాలక్ష్మి పథకం ఇంతవరకు ఇచ్చినటువంటి పాపాన పోలేదన్నారు ఇప్పటికైనా ముఖ్యమంత్రి గారు సూపర్ సిక్స్ భాగమైనటువంటి మహాలక్ష్మి పథకం ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆదివారం డివైఎఫ్ఐ మహిళా కన్వీనింగ్ కమిటీ సమావేశం సుందరయ్య కాలనీలో నిర్వహించారు ఈ సమావేశానికి పట్టణ అధ్యక్షుడు ఎస్కే మస్తాన్ షరీఫ్ అధ్యక్షత వహించడం జరిగింది . ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... కూటమి ప్రభుత్వం మహిళలకు 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతినెల 1500 రూపాయలు నగదు చెల్లిస్తానని లోకేష్ బాబు పాదయాత్ర సందర్భంగా కనిపించినటువంటి ప్రతి మహిళకు హామీ ఇవ్వడం జరిగింది . అయితే సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని కూటమి ప్రభుత్వం హంగుహార్భాటాలు చేసుకోవడం తప్ప చేసింది ఏమీ లేదని వారన్నారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పైబడి అవుతున్న ఒక్క మహిళ ఖాతాలో ఒక్క రూపాయి వేసిన పాపాన పోలేదన్నారు ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆలోచించి ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని అమలు చేయని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మహిళలను కలుపుకొని పెద్ద ఎత్తున సూపర్ సిక్స్ పథకాలు అమలయింతవరకు పోరాటాలు కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్ ఎస్ కే ఆదిల్ మహిళలు షేక్ ఫాతిమా నాగేశ్వరి అరుణ మాధవి లత పీరమ్మ నాగరత్నమ్మ కృష్ణవేణి గౌసియా రిజ్వానా ఆయేషా వెంకటమ్మ పద్మ లక్ష్మీదేవి ఖాదర్ బి తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్‌షిప్ డేకు పూర్వ విద్యార్థుల ప్రత్యేకత





**బేతంచెర్ల:ఆగష్టు2,(ప్రజా జ్యోతి)** స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శేషారెడ్డి ఉన్నత పాఠశాల 1980--81 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా సమావేశమై స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు. బేతంచెర్ల పట్టణంలోని రోటరీ క్లబ్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. అనంతరం సేవా కార్యక్రమం నిర్వహించి తమ స్నేహానికి సామాజిక బాధ్యతను జోడించారు. ఈ సందర్భంగా వీరభద్రరెడ్డి, అహ్మద్ హుస్సేన్, గౌరీ రామిరెడ్డి, జ్ఞానేశ్వర్ గుప్తా, జగన్ మాట్లాడుతూ స్నేహితులతో మళ్లీ ఒకేచోట కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల రోజుల అనుబంధం ఇప్పటికీ కొనసాగుతుండటం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా సమావేశమై సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా మార్చుకు న్నామని తెలిపారు. అనంతరం స్థానిక మిస్బా వృద్ధాశ్రమానికి బియ్యం, కిరాణా సామగ్రి, ఇతర నిత్యావసర వస్తువులను అందజేశారు. సమాజానికి తమ వంతు సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రసాద్ రెడ్డి, రామకృష్ణ, బాలకృష్ణ, రాజశేఖర్, బషీర్ అహ్మద్‌తో పాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం,



**డోన్( ప్రజా జ్యోతి) ఆగస్టు,2** నంద్యాల జిల్లాడోన్ పట్టణంలోని పాత బస్టాండ్ నందు రాఖా హైస్కూల్లో 2000,2001 సంవత్సరం,పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారంఅబ్బిరెడ్డిపల్లె చెరువు దగ్గర స్నేహితుల దినోత్సవం సందర్భంగా అందరూ కలిసి,(సమ్మేళనం) గత విద్యార్థులుజ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనాటి గురువుల గురించి స్నేహితుల గురించి ఒకరికి ఒకరు ఆనందంగా ముచ్చటించుకున్నారు, ఫ్రెండ్షిప్ డే సందర్భంగా కేక్ కట్ చేసి అందరూ పంచుకున్నారు, స్నేహితు లుఎవరు ఏ హోదాలో ఉన్న ఏ ఒక్కరికి సమస్య వచ్చినా ఒకరికి ఒకరం సహాయ సహకారాలు చేసుకోవాలని, మనలో ఏ ఒక్క మిత్రుడు ఆర్థికసమస్యలతో ఇబ్బందులు పడుతున్న అందరము కలిసి ఆ సమస్యను పరిష్కరించాలని తెలిపారు, అందరం ఒకే చోట కలిసి చాలా సంవత్సరాలయింది ఎన్నిరోజుల తర్వాత మళ్లీ ఆదివారం ఫ్రెండ్షిప్ డే సందర్భంగా కలిసినందుకు ఆనందంగా సంతోషంగా ఉందని అన్నారు.

## స్నేహం... రక్తసంబంధాలకు మించిన ఆత్మీయ బంధంలి

**తల్లిదండ్రులకు కూడా చెప్పలేని మనసులోని మాటలను పంచుకునే నమ్మకమే నిజమైన స్నేహం..**

**ఆస్తిపాస్తుల కంటే మంచి మిత్రులే జీవితంలో గొప్ప సంపదలి**




**నంద్యాల:ఆగస్టు=02 ప్రజాజ్యోతి** ఆగస్టు 2: ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా ఫ్రెండ్షిప్ డేను జరుపుకుంటారు. ఈ ఏడాది (2026) ఆగస్టు 2న ఫ్రెండ్షిప్ డే సందర్భంగా దేశవ్యాప్తంగా స్నేహితులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ తమ అనుబంధాన్ని మరింత బలపరుచుకుంటున్నారు. ఈ ప్రత్యేక దినోత్సవం స్నేహం అనే అమూల్యమైన బంధం విలువను మరోసారి గుర్తు చేస్తోంది. స్నేహం అనేది రక్తసంబంధం కాదు. అయినప్పటికీ జీవితంలో ఎన్నో బంధాల కంటే గొప్పదిగా నిలిచే అనుబంధం. తల్లిదండ్రులకు, అన్నదమ్ములకు, రక్తసంబంధీకులకు కూడా చెప్పలేని మనసులోని మాటలను ఎలాంటి సంకోచం లేకుండా పంచుకునే వ్యక్తి నిజమైన మిత్రుడు. మన బాధను తన బాధగా భావించి ఓదార్చే వ్యక్తి, మన ఆనందాన్ని తన ఆనందంగా మార్చుకునే వ్యక్తి, కష్టకాలంలో అండగా నిలిచి ధైర్యం చెప్పే వ్యక్తే అసలైన స్నేహితుడు. ంనిజమైన స్నేహం స్వార్థం, డబ్బు, హోదా, కులం, మతం వంటి భేదాలకు అతీతంగా ఉంటుంది. జీవితంలో ఆస్తిపాస్తులు లేకపోయ.

## నంద్యాల ఆటోనగర్‌లో తీవ్రస్థాయికి చేరిన స్థల వివాదం.

**నంద్యాల:ఆగస్టు=02**




**ప్రజాజ్యోతి** స్థల వివాదంలో వాగ్వాదం.. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యక్తి గుండెపోటుతో మృతి. ఆటోనగర్ స్థల వివాదంలో నిస్సార్ అనే వ్యక్తి దుర్మరణం. మృతుడి కుటుంబానికి, బాధితులకు న్యాయం చేయాలని వ్యాపారుల డిమాండ్. నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చిన ఆటోనగర్ వ్యాపారులు. నిస్సార్ మృతిపై తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన వ్యాపారులు. ఆటోనగర్ ప్లాట్ల కేటాయింపులు, కొలతలపై సమగ్ర విచారణ జరపాలని విజ్ఞప్తి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్. ఆటోనగర్ అధ్యక్షుడు జాకీర్‌తో వాగ్వాదం తర్వాత అస్వస్థతకు గురైన నిస్సార్. స్థల వివాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేసిన తాలూకా పోలీసులు.

## వరద బాధితులకు అండగా మాలల ఐక్యత సంఘం.. 200 కుటుంబాలకు పులిహోర పంపిణీ

**టేకులబోరు పునరావాస కేంద్రంలో ఆహార పంపిణీ**

**వరద బాధితుల ఆకలి తీర్చేందుకు సంఘం సభ్యుల సేవ**

**మానవత్వాన్ని చాటిన మాలల ఐక్యత సంఘం నాయకులు**



**కూనవరం ఆగస్టు 3, ప్రజా జ్యోతి,** కూనవరం, ఆగస్టు 2: శనివారం,గోదావరి నదికి ఆకస్మికంగా వరదలు రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వరద బాధితులకు మాలల ఐక్యత సంఘం అండగా నిలిచింది. టేకులబోరు పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న సుమారు 200 కుటుంబాలకు పులిహోర పంపిణీ చేసి వారి ఆకలి తీర్చేందుకు సహాయం అందించారు. ఈ సేవా కార్యక్రమంలో మాలల ఐక్యత సంఘం నాయకులు మోతుకూరి వెంకన్న, ఎడ్ల గణేష్, బొజ్జ సుధారాణి, తాడేపల్లి జానీ, నాచుపల్లి వెంకన్న, ఎడ్ల రాంబాబు తదితరులు పాల్గొని బాధితులకు ఆహారం పంపిణీ చేశారు. వరదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు.

# గోదావరి ముంపు బాధితులకు అండగా టీడీపీ నాయకులు





శబరి కొత్తగూడెంలో బాధితులను పరామర్శించిన మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు

**కూనవరం, ఆగస్టు 2: ప్రజా జ్యోతి** పోలవరం జిల్లా చింతూరు డివిజన్ కూనవరం మండలం కొండ్రరాజుపేట పంచాయతీ పరిధిలోని శబరి కొత్తగూడెం గ్రామం గోదావరి వరదలతో ముంపునకు గురైన నేపథ్యంలో, తెలుగుదేశం పార్టీ కూనవరం మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆదివారం గ్రామాన్ని సందర్శించి ముంపు బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎడవల్లి భాస్కరరావు మాట్లాడుతూ, వరదల వల్ల నష్టపోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.దఅనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని సందర్శించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. ముంపు ప్రభావిత ప్రాంత ప్రజలకు అవసరమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉంచి ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోడియం అప్పారావు, బూత్ ఇన్‌చార్జి బోడ వెంకటేశ్వర్లు, కుంజ వెంకటేశ్వర్లు, కారం కన్నారావు, మొట్టెం శ్రీరామమూర్తి, నవీన్, గ్రామ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాజకీయ కక్ష సాధింపు చర్యలలో భాగంగానే ఎమ్మెల్యే వీరుపాక్షి అరెస్టు

అరెస్టును ఖండించిన వైకాపా అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి




**గుంతకల్లు ఆగస్టు 2 (ప్రజా జ్యోతి):** కర్నూలు జిల్లా ఆలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే బూసినే విరూపాక్షి మరియు ఆయన కుమారుడు చంద్రశేఖర్‌లను రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే పోలీసులు అర్ధరాత్రి దౌర్జన్యంగా ఎమ్మెల్యే ఇంటి తలుపులు పగలగొట్టి అరెస్ట్‌కు పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి అన్నారు. ఆదివారం ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అక్రమ అరెస్టును నిరసిస్తూ చిప్పగిరిలో నిర్వహించిన రాస్తారోకో నిరసన ధర్నాలో అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి పాల్గొని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి భార్య రామాంజన మ్మతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే చిప్పగిరి విరుపాక్షి పై కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పాలపడుతుందని, ఎమ్మెల్యే విరుపాక్షిని, కుమారుడు ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా అర్ధరాత్రి వేళ దౌర్జన్యంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆమె అన్నారు. ఎమ్మెల్యే విరుపాక్షిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనలో కర్నూలు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఆదోని మాజీ శాసనసభ్యులు సాయి ప్రసాద్ రెడ్డి, పాణ్యం మాజీ శాసనసభ్యులు రాంభూ పాల్ రెడ్డి, మాజీ మంత్రి శైలజానాథ్, ఎమ్మెల్సీ మధుసూదన్, మాజీ పార్లమెంట్ సభ్యురాలు బుట్టా రేణుక, తలారి రంగయ్య,పత్తికొండ మాజీ శాసనసభ్యురాలు శ్రీదేవి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా మరియు అనంతపురం జిల్లా ఉపాధ్య క్షులు వై. ప్రదీప్ రెడ్డి, అలాగే పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు.

# రెండేళ్ల నమ్మకం.. సంక్షేమం అభివృద్ధి
# కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ





**గుంతకల్లు ఆగస్టు 2 (ప్రజా జ్యోతి):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గుంతకల్లు పట్టణంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు మరియు ఆయన సోదరుడు గుంతకల్లు మండలం టిడిపి ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి సూచనలతో ఆదివారం గుంతకల్లు పట్టణంలోని 3,4,5, 6,7,8,9,26 వ వార్డులలో భారీ ఎత్తున నిర్వహించిన డోర్ టు డోర్ (ఇంటింటి) ప్రచార కార్యక్రమానికి విశేష ఆదరణ లభించింది. పోలింగ్ బూత్103'నుంచి 110,121,131 మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, టిడిపి మాజీ పట్టణ అధ్యక్షులు బండారు ఆనంద్, కేశప్ప, 6 క్లస్టర్ ఇన్చార్జి నగర డోనా రవికుమార్, కో క్లస్టర్ లక్ష్మీనారాయణ కూటమి ప్రభుత్వం సాధించిన పురోగతిని, అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను డోర్ టు డోర్ వెళ్లి గడిచిన రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలు, అందించి న సుపరిపాలన విజయాల వివరాలను ప్రతి కుటుం బానికి చేరవేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజ జీవితాల్లో తీసుకొచ్చిన మార్పులను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జిలు, కో యూనిట్ ఇన్చార్జులు, బూత్ ఇన్చార్జులు, కో బూత్ ఇంచార్తులు, వార్డు ఇన్చార్జిలు, టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకులు, కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# తెలుగు వారు గర్వపడేలా అమెరికా మేరీల్యాండ్లో చరిత్ర సృష్టించిన 'రియాక్ట్ ఎయిర్ అంబులెన్స్' ప్రముఖుల నుంచి ప్రశంసలు






**చెన్నూరు, ఆగస్టు,2,** తెలుగు రాష్ట్రాలకే అంకితమైన మొట్టమొదటి ఎయిర్ అంబులెన్స్ సేవ 'రియాక్ట్'.. అమెరికా నేలపై జోరు చూపిస్తోంది. అమెరికా తెలుగు సంఘం (ఏటీఏ) 19వ వార్షిక మహాసభలు జులై 31 నుంచి ఆగస్టు 2 వరకు మూడు రోజులపాటు జరుగుతున్న విషయం తెలిసిందే, మేరీల్యాండ్లో ఘనంగా జరుగుతున్న వేళ, ఈ అత్యాధునిక వైద్య సేవ ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపం.. భారీ ఆకర్షణగా మారింది. హాజరైన వేలాది తెలుగు ప్రజలు, స్థానిక ప్రముఖులు ఈ వినూత్న సేవను చూసి ఆశ్చర్యపోయారు, ఈ ప్రత్యేక వేదికను పలువురు సీనియర్ నేతలు, వైద్య నిపుణులు, సినీ ప్రముఖులు పర్యటించి.. 'రియాక్ట్' సేవలను మనస్ఫూర్తిగా కొనియాడారు. అమెరికా నుంచి తెలుగు రాష్ట్రాలకు, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు 24ఇ7 అందుబాటులో ఉండే ఈ సర్వీసు పనితీరు గురించి ఆంధ్రప్రదేశ్ కడప జిల్లా మండల కేంద్రమైన చెన్నూరు చెందిన తప్పెట డాక్టర్ నీల్ రోహిత్ రెడ్డి సజీవ ప్రదర్శన (లైవ్ డెమో) ద్వారా వివరించారు. డాక్టర్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ.. "ఒక్క క్షణం ఆలస్యమైనా ప్రాణాలకు సమానం. మా లక్ష్యం ఆ అమూల్యమైన క్షణాలను కాపాడటమే" అంటూ సభికులను సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తారు. సంస్థ అంతర్జాతీయ ప్రతినిధులు యన్నంరెడ్డి వినీలారెడ్డి, ఉత్తర అమెరికా ప్రధాన కార్యదర్శి సుకుమార్ రెడ్డి ఈ ఎయిర్ అంబులెన్స్ ఏ విధంగా ప్రాణాలను గగన మార్గంలో రక్షిస్తుందో, అందులోని అత్యాధునిక టెక్నాలజీ, ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) ఏర్పాట్లను వివరంగా వెల్లడించారు. తెలుగు ప్రజలు మాత్రమే కాదు, అక్కడి స్థానిక అమెరికన్ ప్రతినిధులు కూడా ఈ వ్యవస్థ పట్ల అద్భుతమైన ఆసక్తిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ శతావధాని, సాహిత్యవేత్త నరాల రామారెడ్డి .రియాక్ట్ సేవలను అత్యంత అద్భుతమైన ఉపమానంతో కొనియాడారు. ఆయన మాట్లాడుతూ.. "రోగికి సమయమే అమృతం. ఈ సంస్థ ఆ అమృతాన్ని అందించే దివ్యౌషధం" అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. దీంతో ఆ వేదిక మరింత గమనార్హమైంది. అంతర్జాతీయ స్థాయిలో తెలుగు వారి ఔన్నత్యాన్ని చాటుతూ, రియాక్ట్ ఎయిర్ అంబులెన్స్ ప్రాణాధారమైన అవసరంలో భరోసానిచ్చే 'గగన సైన్యం'గా అవతరిస్తోంది. ఈ ప్రత్యేక కార్యక్రమం ఏటీఏ మహాసభల్లోనే కాక, తెలుగు సోషల్ మీడియా వేదికలనూ హల్చల్ చేస్తోంది. ఇక ముందు మన తెలుగు వారి ఆరోగ్య రక్షణ కోసం ఇది ఎంతో కీలకమైన మైలురాయి అని చెప్పాలి!కుమారి ఆలయ ,కుమారి ఆమని అసోసియేట్ డైరెక్టర్లు మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ రియాక్ట్ ఎయిర్ అంబులెన్స్ అమెరికా సంయుక్త రాష్ట్రాలు ,డా॥యెన్నంరెడ్డి లావణ్యరెడిథ ఆపరేషన్స్ ఛైర్మన్ రియాక్ట్ ఎయిర్ అంబులెన్స్ విదేశీ ప్రతినిధులకు సంస్థ ఆశయాలను వివరించారు,

## పత్తి పంటలో పచ్చ దోమ మరియు, మెగ్నీషియం లోపం- వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రి.




**ఎమ్మిగనూరు, అగస్ట్ 02(ప్రజా జ్యోతి):** ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో బోర్లు బావుల కింద సాగు చేసిన పత్తి పంటలో మరియు వర్షాధారం కింద సాగు చేసిన పంటలో పచ్చదోమ మరియు మెగ్నీషియం లోపంగమనించడమైనది. వీటి నివారణకు తీసుకోవలసిన సస్య రక్షణ చర్యలను ఎమ్మిగనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు యస్ మహమ్మద్ ఖాద్రి వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బోర్లు బావుల కింద సాగు చేసిన పత్తి పంట ప్రస్తుతం 70 నుండి 80 రోజుల పంట. ఈ పంటలో మెగ్నీషియం లోపం ఆకులు ఎర్రగా మారి,మొక్క నుండి రాలి కిందపడటం జరుగుతుంది. ఈ లోప నివారణకు మెగ్నీషియం సల్ఫేట్ 5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి. అలాగే నీటి పారుదల మరియు వర్షాధారం కింద సాగు చేసిన పత్తి పంటలో పచ్చదోమ గమనించడమైనది. ఈ దోమ నివారణకు వేపనూనె 5 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటిలో తర్వాత ఫ్లోనికామెయిడ్ 0.3 మిల్లీ లీటర్లు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటిలో కలుపుకొని సాయంత్రం వేళ ఆకులు బాగా తడిచిటట్టు పిచికారీ చేసుకోవాలి అని అన్నారు.

## రైతుల కోసం మేము సైతం

**కుక్కునూరు,ప్రజా జ్యోతి,ఆగస్టు 2 :**రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని లక్ష్యంగా తీసుకుని ప్రవేశపెట్టిన ఏపీఏఐయంఎస్ 2.0 విధానం ద్వారా రైతు ధృవీకరణ అనంతరం మాత్రమే యూరియా,డీఏపీ ఎరువులు పంపిణీ జరుగుతున్నదని కుక్కునూరు మండల వ్యవసాయ అధికారి ఆర్. బాలాజీ స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం ప్రతి అర్హత రైతుకు అవసరమైన ఎరువు,సరైన సమయంలో అనే లక్ష్యంతో ఏపీఏఐఎమ్ఎస్ 2.0 వ్యవస్థను అమలు చేస్తోందన్నారు.సెంటు భూమి సాగు చేస్తున్న రైతు నుంచి పెద్ద రైతు వరకు ప్రతి అర్హత రైతుకు పంట అవసరానికి అనుగుణంగా ఎరువులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.మండలంలోని 8 రైతు సేవా కేంద్రాలలో సాగు చేస్తున్న రైతుల పంటల వివరాల ఆధారంగా యూరియా,డీఏపీ సరఫరా పారదర్శకంగా జరుగుతోందన్నారు. కుక్కునూరు మండల ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముంపు ప్రాంతాలు,పోడు భూములు,కౌలు,అసైన్డ్ భూములు,వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాని భూముల్లో సాగు చేస్తున్న రైతులు జిల్లా కలెక్టర్,ఏలూరు మరియు వ్యవసాయ శాఖ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాల మేరకు దరఖాస్తు చేసుకుని తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు.అటువంటి రైతులకు కూడా అర్హత మేరకు ఎరువులు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఏ పి 2.0 యాప్‌లో రైతు పంట వివరాలు నమోదు చేసి, బయోమెట్రిక్ లేదా ఓటీపీ ధృవీకరణ పూర్తైన తర్వాత మాత్రమే ఎరువుల పంపిణీ జరుగుతోందన్నారు.ఈ విధానంతో ఎరువులు కేవలం సాగు చేస్తున్న రైతులకే చేరుతున్నాయని,అక్రమ నిల్వలు,మళ్లింపులు,ఇతర రాష్ట్రాలకు అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట పడిందని వివరించారు.ఏపీఏఐఎమ్ఎస్ 2.0 అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు కుక్కునూరు మండలంలోని 2,080 మంది రైతులకు 477 మెట్రిక్ టన్నుల యూరియా,176 మెట్రిక్ టన్నుల డీఏపీ వారి పంటల అవసరాలకు అనుగుణంగా పంపిణీ చేసినట్లు తెలిపారు.అలాగే,ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు (ఎఫ్ సీ ఓ),1985 నిబంధనలను ఉల్లంఘిస్తూ రైతులకు బిల్లులు ఇవ్వకపోవడం,రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం వంటి అక్రమాలకు పాల్పడిన ఒక ఎరువుల డీలర్ లైసెన్స్‌ను ఇప్పటికే సస్పెండ్ చేసినట్లు తెలిపారు.రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై భవిష్యత్తులో కూడా ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.గత ఏడాది జూన్--జూలై నెలల్లో కుక్కునూరు మండలంలో 1,035 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు నమోదయ్యాయి.అయితే ఈ ఏడాది అదే కాలంలో ఏపీఏఐయం ఎస్ 2.0 అమలు,రైతు ధృవీకరణ విధానం,పంటల అవసరానికి టన్నుల యూరియా మాత్రమే పంపిణీ జరిగిందని ఏఓ బాలాజీ తెలిపారు.

## వాట్సాప్‌లో కొత్త రూల్..
## వయస్సు వివరాలపై చర్చ!

ప్రపంచంలో ఎక్కువమంది ఉపయోగించే మెసేజింగ్ యాప్‌లలో ఒకటైన వాట్సాప్‌లో కొత్త మార్పు కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది భారతీయ వినియోగదారులను తమ పుట్టిన తేదీ వివరాలు నమోదు చేయాలని వాట్సాప్ కోరుతున్నట్లు సమాచారం. దీంతో వాట్సాప్ వయస్సు ధృవీకరణ నిబంధనలను తీసుకురావడానికి సిద్ధమవుతోందా?.. అనే చర్చ మొదలైంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన సోషల్ మీడియా పోస్టులు కూడా వైరల్ అవుతున్నాయి. ఇందులో యూజర్లను పుట్టిన తేదీని నమోదు చేయమని కోరుతున్నట్లు కనిపించింది. బహుశా భారత ప్రభుత్వం నిబంధనల కారణంగా ఈ అప్డేట్ తీసుకొస్తోందా?, అనే సందేహం కలుగుతోంది. అయితే.. ఈ విషయంపై ఇప్పటివరకు వాట్సాప్ కానీ, భారత ప్రభుత్వం కానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాబట్టి ఇది పూర్తిగా నిజమని నమ్మలేము. అధికారిక సమాచారం వచ్చే వరకు వేచి చూడాలి.

## పెరిగిన పెట్రోల్, డీజిల్ అమ్మకాలు..
## తగ్గిన ఎల్పీజీ సేల్స్

భారత్‌లో ఎల్‌నినో ప్రభావంతో కొన్నిరాష్ట్రాల్లో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. జులైలో నైరుతి రుతుపవనాలు బలహీనంగా మారడంతో వర్షాలు తగ్గి రైతులు, వాహనదారుల నుంచి పెట్రోలు , డీజిల్‌కు డిమాండ్ పెరగడంతో దేశంలోని మూడు ప్రధాన ప్రభుత్వ చమురు కంపెనీల విక్రయాలు పెరిగినట్లు పారిశ్రామిక సేల్స్ డేటా వెల్లడించింది. ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు గతేడాది జులైలో 3.14 మిలియన్ టన్నుల పెట్రోల్‌ను విక్రయించగా, ఈ ఏడాది జులై వచ్చేసరికి 3.45 మిలియన్ టన్నులు విక్రయించినట్లు తెలిపింది. గతేడాది జులైతో పోలిస్తే ఇది 9.7 శాతం అధికం. 2024 జులైలో ఈ చమురు సంస్థల పెట్రోల్ విక్రయాలు 2.99 మిలియన్ టన్నులుగా కాగా, రెండేళ్లతో పోలిస్తే ప్రస్తుతం పెట్రోల్ విక్రయాలు 15.1 శాతం పెరిగాయి. ఇక ఈ ఏడాది జూన్‌లో పెట్రోల్ అమ్మకాలు 3.48 మిలియన్ టన్నులు కాగా, జులై వచ్చేప్పటికీ 1.1 శాతం అమ్మకాలు తగ్గాయి.

భారత ఆర్థిక కార్యకలాపాలకు కీలక సూచిక అయిన డీజిల్ అమ్మకాలు గతేడాది జులైతో పోలిస్తే ఈ ఏడాది 10.7 శాతం అధికంగా నమోదయ్యాయి. 2025 జులైలో 6.43 మిలియన్ టన్నుల డీజిల్ విక్రయాలు జరగగా, ఈ ఏడాది జులైలో 7.12 మిలియన్ టన్నులుగా ఉంది. సరకు రవాణా, వ్యవసాయ యంత్రాల్లో, నీటిపారుదలకు సంబంధించి భారత్‌లో డీజిల్‌ను కీలక ఇంధనంగా ఉపయోగిస్తారు. జులై నెల విత్తనాల కాలం కావడం, సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదుకావడంతో నీటిపారుదల కోసం డీజిల్ వినియోగం భారీగా పెరిగినట్లు నిపుణులు పేర్కొన్నారు. 2024 జులైతో పోలిస్తే ఈ ఏడాది డీజిల్ విక్రయాలు 11.5 శాతం, 2023 ఏడాదితో పోలిస్తే 12.7 శాతం ఎక్కువగా నమోదైనట్లు పారిశ్రామిక వర్గాలు తెలిపాయి.

# తర్నం బాధ తీరేదెన్నడో?

**వంతెన నిర్మాణం పూర్తికాక ప్రజల అవస్థలు**

**మూడు మండలాలతోపాటు మహారాష్ట్రకు వెళ్లే వారికి ఇబ్బంది**

**తాజాగా కురిసిన వర్షాలతో బ్రిడ్జి మీదుగా వరద రాకపోకలకు తీవ్ర అంతరాయం**

**కొరవడిన అధికారుల పర్యవేక్షణ**



**ఆదిలాబాద్ :** జాతీయ రహదారి 353–బీ విస్తరణలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలోని తర్నం వద్ద నిర్మిస్తున్న వంతెన పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. బేల మండలంలోని ఉపాసనాల నుంచి భోరజ్ వద్ద జాతీయ రహదారి 44కు కలిపేలా నేషనల్ హైవే అథారిటీ అధికారులు 353–బీ జాతీయ రహదారిని నిర్మిస్తున్నారు. రూ.194 కోట్లతో 33 కిలోమీటర్ల నిర్మాణంలో భాగంగా రెండు వరుసల రహదారితోపాటు తర్నం వంతెనల నిర్మాణం కొనసాగుతున్నది. వంతెన నిర్మాణం, కల్వర్టులు, ఏడు మీటర్లు ఉన్న రహదారిని పది మీటర్ల విస్తరణ వంటి పనులు చేపడుతున్నారు. 2024 మే నెలలో ప్రారంభమైన పనులు రెండు సంవత్సరాల్లో 2026 మే నెలలో పూర్తి కావాల్సి ఉంది. ఈ రహదారి మీదుగా భోరజ్, జైనథ్, బేల మండలాలతోపాటు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం కారణంగా వర్షకాలంలో మూడు మండలాలతోపాటు మహారాష్ట్రకు తమ పనుల కోసం వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు.

**వాహనాల రాకపోకలకు అంతరాయం**

తర్నం వంతెన పనులు రెండేళ్లుగా కొనసాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా పిల్లర్లు వేసి స్లాబ్ వేయాల్సి ఉంది. ఇప్పటికే కేవలం పిల్లర్ల పనులు మాత్రమే పూర్తి చేశారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసి ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాల్సిన నేషనల్ హైవే అథారిటీ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఎన్‌హెచ్ కార్యాలయం ఆదిలాబాద్‌లో కాకుండా నిర్మల్‌లో ఉండడంతో అధికారులు అప్పుడప్పుడూ వస్తుంటారని స్థానికులు అంటున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి జైనథ్, భోరజ్, బేల మండలాల రైతులు వ్యవసాయ పనులు, పంటల విక్రయాలు స్థానికులు తమ రోజువారి అవసరాలు వైద్యం, విద్య, ఇతర పనుల కోసం ఈ రహదారి మీదుగా ప్రయాణం చేస్తుంటారు. ప్రజా, సరుకు రవాణాకు అంతరాయం కలుగకుండా నేషనల్ హైవే అధికారులు రూ.4.50 కోట్లతో తాత్కాలిక వంతెన నిర్మించారు. భారీగా నిధులు వెచ్చించి నిర్మించిన బ్రిడ్జి వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా పనులు చేపట్టాల్సి ఉండగా అధికారులు తక్కువ ఎత్తులో పైపులు వేసి నిర్మాణం చేశారు. దీంతో చిన్నపాటి వర్షానికి వంతెన పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండగా రవాణాకు ఆటంకం కలుగుతుంది. సరుకులు రవాణా చేసే లారీలు నీటి ప్రవాహానికి ప్రమాదానికి గురై వంతెన కింద పడిపోయిన ఘటనలు గతేడాది చోటు చేసుకొన్నాయి. జిల్లాలో ఇటీవల కురుసిన వర్షాలతో వంతెన పైనుంచి వరద నీరు ప్రవహించగా రాకపోకలు నిలిచాయి. అధికారులు స్పందించి వంతెన పనులు తొందరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎదురెక్కుతున్న గోదావరి జలాలు



**ధర్మారం/ రామడుగు/ మల్యాల/ మెట్‌పల్లి రూరల్ :** ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా గోదావరి జలాలు ఎస్సారెస్పీ వైపు ఎదురెక్కుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్ –2 పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ధర్మారం మండలం నంది మేడారంలోని నంది, రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌లతో పాటు, పునర్జీవ పథకం ద్వారా జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్, మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌస్‌లలో ఆదివారం నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. నంది, గాయత్రీ పంప్‌హౌస్‌ల ద్వారా వరదకాలువకు వస్తున్న జలాలు.. అక్కడి నుంచి ఒకవైపు శ్రీరాజరాజేశ్వర జలాశయానికి తరలుతుండగా, మరోవైపు రాంపూర్, రాజేశ్వర్‌రావు పంప్‌హౌస్‌ల ద్వారా ఎస్సారెస్పీ వైపు ఎదురెక్కుతున్నాయి.

## జాతీయ చేనేత దినోత్సవ మహాసభను విజయవంతం చేయాలి..

**తెలంగాణ చేనేత ఐక్యవేదిక**

**తంగళ్లపల్లిలో కరపత్రాల ఆవిష్కరణ**

**చేనేత వర్గాలకు తెలంగాణ చేనేత ఐక్యవేదిక పిలుపు**

**సిరిసిల్ల :** జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించనున్న చేనేత చైతన్య మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మార్కండేయ దేవాలయంలో ఆదివారం మహాసభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కరీంనగర్ పద్మశాలి కళ్యాణ మండపంలో జరిగే ఈ మహాసభలో చేనేత కళాకారులు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, అలాగే నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులకు సన్మానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చేనేత వర్గాలకు చెందిన కులబంధువులు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

# అవిగో కాళేశ్వరం ఎత్తిపోతలు..





**పెద్దపల్లి, :** 'కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కాళేశ్వరం గుడి కాదు.. లేకపోతే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి చెందిన రెండు పియర్లు కాదు.. ఒక బళార్థక సాధక ప్రాజెక్టు పేరు కాళేశ్వరం.. ఆ కాళేశ్వరంలో అంతర్భాగమే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, నంది మేడారం నందీ పంపులు, నందీ రిజర్వాయర్, రాంపూర్ పంపులు, మిడ్ మానేరు గ్రావిటీ కెనాళ్లు, అండర్ టన్నెళ్లు, వందలాది పంపుల ఎత్తిపోతలు, వందలాది విద్యుత్ సబ్ స్టేషన్లు, వేలాది కిలో మీటర్ల కెనాళ్లు.. ఇవన్నిటి సంగమమే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 94వేల కోట్ల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు.. అంతే కానీ కాంగ్రెస్ పార్టీ చెబుతున్నట్లు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులు చెబుతున్నట్లు మేడిగడ్డలో కుంగిన రెండు పియర్లు కాదు..'అని బీఆర్ఎస్ ప్రతినిధి బృందం తేట తెల్లం చేసింది.

ఆదివారం జగిత్యాల జిల్లా కోటి లింగాల, పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని నంది పంపు హౌజ్‌లోని డెలివరీ సిస్టర్న్?ను మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, టీ. జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎమ్మెలేలు దాసరి మనోహర్‌రెడ్డి, సుంకే రవిశంకర్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్లు తులా ఉమ, దావ వసంతతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వారు ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండగానే తెలంగాణ అంతటికీ సాగు నీరు త్రాగు నీరు రాదని, ఆ నీళ్లు వినియోగించుకోవడానికి కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన పంపులు ఎత్తిపోయాలి, రిజర్వాయర్లు ఒడిసి పట్టాలి, పంపులు ఎత్తి మిడ్ మానేరును నింపాలి అలా తెలంగాణ అంతటికీ కాళేశ్వరంలో అంతర్భాగమైన సొరంగ మార్గాలు, అండర్ టన్నెళ్లు, గ్రావిటీ కెనాళ్ల ద్వారా తెలంగాణ అంతటికీ సాగు త్రాగు నీరు అందుతుందని కాంగ్రెస్ చెబుతున్న మేడిగడ్డ రెండు పియర్లు కేవలం 500ల కోట్లు కూడా కాదని తేట తెల్లం చేసింది.

**ఇవిగో నంది డెలివరీ సిస్టర్న్?లో కాళేశ్వరం ఎత్తిపోతలు : మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు తలపెట్టిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అసంపూర్తిగా ఉండేదని, గేట్లు పెడితే రాయపట్నం వంతెనను నిర్మించాల్సి వస్తుందని, ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం ఇవ్వాల్సి వస్తుందని కనీసం ఆ ప్రాజెక్టుకు గేట్లు కూడా బిగించలేదని విమర్శించారు. అలాంటి పరిస్థితుల్లో ఆ సమయంలో కేవలం ఆరోజు 35లక్షల ఎకరాలకే నీళ్లు ఎందుకు వచ్చాయని.. వరి పంట 68లక్షలే ఎందుకు పండిందని..? కేసీఆర్ వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం అయిన తర్వాత కోటి 60లక్షల ఎకరాలకు నీళ్లు ఎట్లా వచ్చాయని, రెండు కోట్ల 68లక్షల పంట ఎట్ల పండిందో జవాబు చెప్పాలన్నారు. మీరు కట్టిన ఎల్లంపల్లి నుంచే నీళ్లు పారితే.. ఎల్లంపల్లి నుంచే రాష్ట్రం అంతా 240టీఎంసీల నీళ్లు వచ్చేటట్టు ఉంటే.. ఆరోజు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు నిర్మాణానికి ఎందుకు ప్రతిపాధన చేశారో చెప్పాలన్నారు. ఎల్లంపల్లే సరిపోతది కదా.. మరి మీరు ఇప్పుడు తుమ్మిడిహెట్టి దగ్గర బ్యారేజీ కట్టి తీరుతం అని ఎందుకు అంటున్నారో ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపాధనలకే పరిమితం అయ్యారు.

కనీసం అక్కడ తట్టెడు మట్టి కూడా తీయలే.. కబుర్లతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం అంటే కేవలం ఒక్క మేడిగడ్డ కాదు.. ఒక బ్యారేజీ కాదు.. కాళేశ్వరం అంటే అనేక బ్యారేజీల నిర్మాణం, అనేక రిజర్వాయర్ల నిర్మాణం, వేల కిలో మీటర్లు గ్రావిటీ కెనాల్స్??, అండర్ టన్నెల్స్??, పంపు హౌజ్‌లని మా నాయకులు హరీష్‌రావు, కేటీఆర్ ఇవన్నీ చెప్పీ చెప్పీ ప్రజలకు అర్థం అవుతున్నా.. కాంగ్రెస్ మంత్రులు, ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలు, నాయకులకు మాత్రం అర్థం కావడం లేదన్నారు. అర్ధమై నటిస్తున్నరా.. లేదా మరో మారు ప్రజలను మోసం చేద్దామనే కుట్ర పూరితం తప్ప ఇందులో ఏమీ లేదన్నారు. అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాటలకు ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఎల్లంపల్లి నుంచి ఎలా మిడ్ మానేరుకు నీళు పోతున్నాయో వివరించేందుకే ఈ యాత్ర చేపట్టామన్నారు.

ఎల్లంపల్లి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన నంది, రాంపూర్ పంపు హౌజ్‌లు రిజర్వాయర్ల ద్వారానే ఎత్తిపోతల ద్వారానే మిడ్‌మానేరుకు నీళ్లు పోతున్నాయన్నారు. వాస్తవాలు ప్రజలకు తెలియాలని బీఆర్ఎస్ బృందం ఇక్కడికి వచ్చిందన్నారు. ఇగో మీ కళ్ల ముందు కనబడుతున్న నీళ్లు ఎల్లంపల్లి నుంచి మోటార్లు ఆన్ చేయకుండానే ఇక్కడికి వచ్చినవా.. ఈ మోటార్లు కాళేశ్వరం ప్రాజెక్టులోని లింక్–2లోనివి కాదా..? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన ఎల్లంపల్లి ప్రాజెక్టు, నంది పంపు హౌజ్ ఈ నిర్మాణం అంతా కాళేశ్వరంలో భాగమే. ఈ కాళేశ్వరం పంపులు ఆన్ చేస్తేనే నంది డెలివరీ సిస్టర్న్? ద్వారా నంది రిజర్వాయర్ నిండుతది.. నందీ రిజర్వాయర్ నిండితేనే గాయత్రీ పంపు హౌజ్‌కు నీళ్లు పోతాయి. ఈ కనీస అవగాహణ లేకుండా.. ఇవన్నీ ఏం తెలియకుండా గాలికి మాట్లాడుతున్నారు మంత్రులు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నట్లుగా గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీళ్లుంటేనే రాష్ట్ర మంతా నీళ్లు పారుతాయనుకుంటే.. తెలంగాణ రాక పూర్వం రాష్ట్రంలో నీళ్లెందుకు లేవో మంత్రి అడ్లూరి సమాధానం చెప్పాలన్నారు.

**గోదావరి జలాలను తెలంగాణ బీళ్లకు మళ్లించింది కేసీఆర్ : మాజీ మంత్రి జీవన్ రెడ్డి**

గోదావరి జలాలను రైతులకు అందించి సస్యశ్యామలం చేసింది కేసీఆర్ అన్నారు. తెలంగాణ సాగు, తాగు నీటి కష్టాలు లేకుండా ముందుచూపుతో కరువు అనే మాటే లేకుండా కాళేశ్వరం నిర్మించారన్నారు. నది జలాలను ఎలా వాడుకోవాలో తెలిసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని దిగువకు వెళ్ళే నీటిని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎగువకు పారెలా చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. శ్రీరాంసాగర్ వరద నీరు కాలువల ద్వారా, గ్రావిటీ ద్వారా కిందకు వెళ్తాయి. ఎల్లంపల్లి నుండి పంప్ హౌజ్‌ల ద్వారా నీటిని ఎగువకు తరలించే ఆలోచన చేసింది కేసీఆర్ అన్నారు. ఎల్లంపల్లి నుంచే నీళ్ళు ఇస్తున్నామని అంటున్న కాంగ్రెస్ నాయకులకు బుద్ధి లేదని వారు విమర్శించారు. కన్నెపల్లి వద్ద కాపర్ డ్యాం ఎందుకు నిర్మాణం చేయడం లేదని, దేవుడు కరుణిస్తే ఈ నీళ్లు వచ్చాయి లేకుంటే కాంగ్రెస్ నాయకులు ఏం చేసేవారని ప్రశ్నించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ఈ మూరపు ఆలోచనలు మానుకోవాలన్నారు. కరువులో ఆదుకుంది కాళేశ్వరం ప్రాజెక్టు అని, అంతా అయిపోయాక ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎస్ఆర్ఎస్పీ సందర్శనలు చేయడం ఏమిటో అర్థం కావడలం లేదన్నారు.

భగవంతుడు కరుణించి వర్షాలు పడితే కాంగ్రెస్ నేతలు రాజకీయం చేస్తున్నారు. ఒకవైపు వాళ్ల ముఖ్యమంత్రికి అవగాహణ లేదు నీళ్లపైన.. మరో వైపు వాళ్ల మంత్రులకు అవగాహణ లేదు. ముఖ్యమంత్రి స్వయంగా దేవాదుల ఏ బేసిన్ కింద ఉన్నదో తెలియదు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంత్రి అయ్యాక నీళ్లు ఎక్కడి నుంచి ఎక్కడికి పోతున్నాయనే కనీస అవగాహణ లేకుండా మాట్లాడుతున్నాడు. శ్రీపాద ఎల్లంపల్లి నుంచి గ్రావిటీ ద్వారా నీళ్లు వెళు తున్నాయంటున్నాడు. నీళ్లపై వాళ్లకు అవగాహణ కల్పించేందుకే ఈ రోజు ఈ యాత్ర పెట్టుకోవడం జరిగిందన్నారు. మాజీ ఎంపి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డికి నీళ్ల గురించి కాళేశ్వరం జలాల గురించి ఏబీసీలు కూడా తెలియదని, కాళేశ్వరం ప్రాజెక్టు అంటే వాళ్లు కాళేశ్వరం గుడి అనుకుంటున్నారన్నారు.

కాళేశ్వరం అనేది దేశంలోనే ఒక గొప్ప ప్రాజెక్టు. చాలా పెద్ద ప్రాజెక్టు. ఆయనకు అవగాహణ లేదు. ఆయనకే కాదు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా అవగాహణ లేదన్నారు. నీళ్లపైన తెలంగాణ ఉద్యమకారులకు ఉన్న కనీస అవగాహణ ఈ కాంగ్రెస్ మంత్రులకు లేదన్నారు. ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు గ్రావిటీ ద్వారా పోతది అంటున్నారు. ఇక్కడ నంది డెలివరీ సిస్టర్న్?కు ఇక్కడ పంపులు ఆన్ చేయకుండానే వస్తున్నాయా..? అని ప్రశ్నించారు. ఈ గుట్టళ్లల్లో నుంచి ఉబికి వస్తున్నాయా..? ఎల్లంపల్లి నుంచి ఈ నంది మేడార్ డెలివరీ సిస్టర్న్?కు 100మీటర్ల ఎత్తుకు వచ్చి ఇక్కడ పోస్తున్నాయన్నారు. దాదాపుగా ఇక్కడికే 200ల అంతస్థుల భవనంపై ఎత్తునుంచి పోస్తున్నాయన్నారు.

**కాళేశ్వరంతో కరువును దూరం చేసింది కేసీఆర్.. :ఎమ్మెల్సీ ఎల్. రమణ**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ కరువు ప్రాంతంగా ఎండిన చెరువులు, కుంటలతో కనిపించేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ సస్యశ్యామలం అయిందన్నారు. కాళేశ్వరంపై ఎన్ని కుట్రలు చేసినా ప్రజలకు వాస్తవాలు కనిపిస్తున్నాయన్నారు. నంది పంప్ హౌజ్ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం కాదా.. ఈ ఎత్తిపోతలు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోనివి కాదా..? అని ప్రశ్నించారు. కళ్లున్న కబోదుల్లారా ఈ దృశ్యాలను చూసైనా అవగాహణ పెంచుకోవాలన్నారు. కాళేశ్వరంపై కక్ష గట్టి, కేసీఆర్‌పై కోపంతో ఈ పంపులు ఆన్ చేయకుండా ఇన్ని రోజులు ప్రజలను ఇబ్బంది పెట్టారన్నారు. ఇప్పుడు తప్పక పంపులు ఆన్ చేయాల్సి వచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలే ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ ముందుకు సాగుతుందన్నారు. ఎప్పుడూ కరువు ప్రాంతంగా ఉంటుండే.. సీఎంగా కేసీఆర్ గొప్ప ప్రాజెక్టు కాళేశ్వరం నిర్మించారన్నారు. ప్యాకేజీ 6 పంపులు ఎత్తిపోస్తున్న నీరే సజీవ సాక్ష్యమని, తెలంగాణ ప్రాంతానికి సాగు తాగు నీరు ఇచ్చేది ఇలాగే అన్నారు. ఇదే సజీవ సాక్ష్యమని అగో ఎల్లంపల్లి నుంచి నీళ్లను ఇక్కడ ఎత్తిపోస్తున్నది కాళేశ్వరం ప్రాజెక్టులోని నందిమేడారం పంపులే అన్నారు. ఇక్కడ ఒక నది ప్రవాహం ఎలా వస్తున్నదో ప్రజలకు తెలుసు అన్నారు. ఈ ప్రాజెక్టును కాపాడుకొని సుస్థిరమైన ఆయకట్టు, త్రాగునీటి కోసం కృషి చేస్తామన్నారు. ఏపరిస్థితులోనైనా ప్రజల ప్రయోజనాలను కాపాడుకుంటామని, గోదావరి జలాలను ఒడిసి పట్టి ఈ నంది పంపులతో నంది మేడారం రిజర్వాయర్‌ను నింపుకొని రాంపూర్ పంపులతో మిడ్ మానేరును నింపు కుంటున్నామన్నారు.

# పూసపల్లి ముత్తయ్య పదవి విరమణ కార్యక్రమం లో

## ఉప్పల్ ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ నాగరాజు పోలీసు బృందం





**ఉప్పల్ :** ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న పూసపల్లి ముత్తయ్య సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, పోలీస్ శాఖలో 37 సంవత్సరాలకు పైగా నిజాయితీ నిబద్ధత, క్రమశిక్షణ, కష్టపడే తత్వంతో ప్రజలకు విశిష్ట సేవలందించి గౌరవప్రదం గా పదవీ విరమణ చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయనతో కలిసి సేవలందించిన బ్యాచ్‌మేట్స్, బంధువులు, ఆత్మీయ మిత్రులు, ప్రత్యేకంగా ఆయనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ ఉ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. నాగరాజు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్,ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది ఇతర ఆహ్వానితులు హాజరై ముత్తయ్య విశిష్ట సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానించారు.ముత్తయ్య తన ఉద్యోగ జీవితమంతా కర్తవ్యనిష్ఠ, నిజాయితీ, వినయం, అంకితభావంతో సేవలందించి సహచరులకు, యువ పోలీసు అధికారులకు ఆదర్శప్రాయంగా నిలిచారు. ఆయన పదవీ విరమణ అనంతర జీవితం ఆయురారోగ్యాలు, ఆనందం, ప్రశాంతత, కుటుంబ సభ్యుల ప్రేమాభిమానాలతో నిండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాము.”పదవీ విరమణ ఉద్యోగానికి మాత్రమే సేవాస్ఫూర్తికి కాదు. మీ నిజాయితీ, క్రమశిక్షణ, సేవా తపన ఎల్లప్పుడూ అందరికీ స్ఫూర్తిదాయకంగానే నిలుస్తాయి.”

# నందినగర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన యువనేత

- జన్మదినం సంబంధించిన బర్త్ డే ఫ్రేమ్ అందజేత
- పూరీ తీరాన సైకత శిల్పంను ఏర్పాటు చేసిన చిర్రా రవీందర్ యాదవ్
- సైకత శిల్పం చిత్ర పటాన్ని కేటీఆర్ కి అందించిన చిర్రా రవీందర్ యాదవ్
- రవీందర్ యాదవ్ పై ప్రశంసలు కురిపించిన వర్కింగ్ ప్రెసిడెంట్
- శేరిలింగంపల్లిలోని తాజా రాజకీయాలు, పార్టీ బలోపేతంపై చర్చ
- వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకంలో వచ్చే ప్రతి ఎన్నికల్లో భారాసదే విజయం
- శేరిలింగంపల్లి ఉద్యమ నాయకులు చిర్రా రవీందర్ యాదవ్ ధీమా



**శేరిలింగంపల్లి :** భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో శేరిలింగంపల్లి ఉద్యమకారుడు చిర్రా రవీందర్ యాదవ్ నందినగర్ లోని ఆయన నివాసంలో ప్రత్యేకంగా కలిశారు.మర్యాదపూర్వక సమావేశంలో కేటీఆర్ కి సైకత శిల్పంతో కూడిన చిత్ర పటాన్ని అందించారు.కేటీఆర్ జన్మదినం సందర్భంగా చిర్రా రవీందర్ యాదవ్ పూరీ తీరాన సైకత శిల్పాన్ని ఏర్పాటు చేసి బర్త్ డే విషెస్ తెలిపారు. అందుకు సంబంధించిన ఫోటో ఫ్రేమ్ ను కేటీఆర్ కి అందించారు. ఫోటో ఫ్రేమ్ తో పాటు సైకత శిల్పం విషయాలను వివరించారు.ఈ సందర్భంగా కేటీఆర్,చిర్రా రవీందర్ యాదవ్ పై ప్రశంసలు కురిపించారు. బాగుందని కితాబిచ్చారు. అలాగే శేరిలింగంపల్లిలోని తాజా రాజకీయాలను సైతం చర్చించారు. పార్టీ బలోపేతంకు తీసుకోవాల్సిన చర్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లుగా పేర్కొన్నారు.ఈ సందర్భంగా చిర్రా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో శేరిలింగంపల్లిలో భారాసను గెలిపించుకొని తీరుతామన్నారు. ఎంత మంది నేతలు పార్టీలు మారినా భారాసకు తిరుగులేదని, యువ నాయకత్వంతో ముందుకు సాగుతున్నామని, జెన్ జీ ఆశయాలకు అనుగుణంగా బలోపేతం జరుగుతుందని వెల్లడించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకంలో వచ్చే ప్రతి ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగరేస్తామని ఆయన వెల్లడించారు.

# రామకృష్ణపురంలో విజయవంతమైన రక్తదాన శిబిరం




**తలకొండపల్లి :** తలకొండపల్లి మండలం రామకృష్ణపురంలో లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ (డిస్ట్రిక్ట్ 320ఏ) ఆధ్వర్యంలో దివంగత జి.అంజి రెడ్డి స్మారకార్థం ఆదివారం రక్తదాన శిబిరం ఘనంగా నిర్వహించారు.ఈ శిబిరాన్ని లింగారావుపల్లి సర్పంచ్ లయన్ కాసు శ్రీనివాస్ రెడ్డి,లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్ కార్యదర్శి లయన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి,పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డి,డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్స్ లయన్ మిట్టపల్లి సునంద అంజయ్య,లయన్ జూలూరి రమేష్,లయన్ బండెల రామచంద్ర రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మనిషి ప్రాణాన్ని కాపాడే అత్యంత విలువైన దానం రక్తదానం అని అన్నారు.రక్తదానం అత్యున్నత మానవ సేవ అని,ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేసి అవసరమైన వారికి ప్రాణదాతగా నిలవాలని పిలుపునిచ్చారు.దివంగత జి.అంజి రెడ్డి జీవితకాలంలో ఎన్నోసార్లు రక్తదానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచారని,వారి సేవా స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు.లయన్స్ సభ్యులు రక్తదానం మహాదానం ఒక యూనిట్ రక్తం మూడు ప్రాణాలకు జీవదానం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.ప్రతి ఆరోగ్యవంతుడు ఏడాదికి కనీసం రెండు సార్లు రక్తదానం చేయాలని కోరారు.శిబిరంలో యువత స్వచ్ఛంద రక్తదాతలు విశేషంగా స్పందించి 40 మంది రక్తదానం చేశారు..రక్తదానం చేసిన ప్రతి వ్యక్తి ఒక ప్రాణాన్ని మాత్రమే కాదు ఒక కుటుంబానికి కొత్త ఆశను అందిస్తాడు అని పిఆర్ఓ పాషా తెలిపారు.ఈ కార్యక్రమానికి క్యాంప్ చైర్మన్ లయన్ పి.అంజి రెడ్డి నాయకత్వం వహించారు.లయన్స్ క్లబ్ సభ్యులు,గ్రామ పెద్దలు భాస్కర్ రెడ్డి,కోటేశ్వర్ రెడ్డి,రంజిత్ రెడ్డి,కోటి రెడ్డి,యువత,మహిళలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జ్ఞాపకాల జల్లు.. స్నేహబంధాల సందడి..!

- శంకరపల్లి జడ్‌పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం
- గురువులను ఘనంగా సత్కరించిన శిష్యులు..
- రెండు దశాబ్దాల తర్వాత కలిసిన విద్యార్థులు





**చేవెళ్ల :** స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శంకరపల్లి జడ్‌పీహెచ్‌ఎస్‌లో 2006--07 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. దాదాపు రెండు దశాబ్దాల అనంతరం ఒకేచోట కలుసుకున్న సహపాఠులు బాల్యస్మృతులను గుర్తుచేసుకుంటూ భావోద్వేగ క్షణాలను ఆస్వాదించారు.ఒకప్పుడు కలిసి కూర్చున్న తరగతి గదులు, ఆడుకున్న పాఠశాల మైదానం, ఉపాధ్యాయుల బోధనలు, స్నేహితులతో గడిపిన మధురానుభూతులను నెమరువేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనందం, ఆత్మీయత, చిరునవ్వులు, భావోద్వేగాలతో సమ్మేళనం ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమానికి అప్పటి ప్రధానోపాధ్యాయుడు బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు సురేష్, శ్రీశైలం, అంజయ్య, సత్యనారాయణ, పెంటయ్య, మల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీదేవి, అంబిక, కిషన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తమ జీవితాలకు పునాది వేసిన గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, కృతజ్ఞతాభావం వ్యక్తం చేశారు. గురువులు కూడా తమ శిష్యులు వివిధ రంగాల్లో స్థిరపడటం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు. 2006--07 విద్యాసంవత్సరానికి చెందిన సుమారు 100 మంది పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సరదా ఆటలు, అనుభవాల పంచుకోలు, జ్ఞాపకాల ముచ్చట్లు, ప్రేరణాత్మక ప్రసంగాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, “కాలం మారినా.. స్నేహం మారదు.. గురువుల బోధనలు జీవితాంతం మార్గదర్శకమే” అని పేర్కొన్నారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ బిపల్లిలో ఘనంగా మహంకాళి బోనాలు

## బోనమెత్తిన మాజీ జెడ్పిటిసి ఎమ్మె శ్రీలత సత్యనారాయణ



**కొత్తూర్ :** కొత్తూర్ మండలంలోని ఎస్ బి పల్లి గ్రామంలో మహంకాళి మాత బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ బోనాల ఉత్సవాలలో మాజీ జెడ్పిటిసి ఎమ్మె శ్రీలత సత్యనారాయణ బోనం ఎత్తుకొని మహిళలతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ యేడు వర్షాలు బాగా కురుసి పాడి పంటలు సమృద్ధిగా పండి రైతులంతా ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలలో మహిళలు, యువతీ యువకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ దుర్గమ్మ తల్లి బోనాల మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్‌లో నిర్వహించిన శ్రీ దుర్గమ్మ తల్లి బోనాల మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూన శ్రీశైలం గౌడ్ ఆ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నరు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్ శాలువాతో ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్ ముదిరాజ్, 296 డివిజన్ ప్రెసిడెంట్ జక్కుల మల్లేష్, కాంగ్రెస్ నాయకులు ఆకుల ప్రేమ్, ఉదయ్ గౌడ్, బాల్ రెడ్డి, నవీన్ గౌడ్, ఆకుల మల్లేష్, కావలి శివకుమార్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రేణుకా ఎల్లమ్మ కళ్యాణంలో పాల్గొన్న ఆకారపు అరుణ్ పటేల్



**ఉప్పల :** రామంతాపూర్, శ్రీనగర్ కాలనీలోని భారత్ నగర్లో అత్యంత వైభవంగా జరిగిన రేణుకా ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం లో ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. నియోజకవర్గ ప్రజలందరిపై ఆ ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో అరుణ్ పటేల్ తో పాటు వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజి రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు మెంగ శోభ,మెంగ రవి, అరుణ్ సాయి, యస్ రామ్ రెడ్డి,రాపోలు శ్రీనివాస్ కాలనీవాసులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# బాలాజీ ఎంక్లేవ్ ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్ లో బన్నాల





**ఉప్పల్ :** బీరప్ప గడ్డ డివిజన్లోని బాలాజీ ఎంక్లేవ్ కాలనీలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ లో కాలనీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వేణుగోపాల్ రెడ్డి,ఓంకార్ సింగ్ వారి కాలనీ సభ్యులతో కలిసి పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,గత నెల బాలాజీ ఎన్క్లేవ్ కాలనీ పర్యటనలో భాగంగా కాలనీలోని పలు వీధుల్లో రోడ్డు సైడ్ చెత్తా చెదారాలు నిండిపోయి ఉన్న విషయాన్ని కాలనీ అధ్యక్ష కార్యదర్శులు మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ కు తెలపడం జరిగింది.అందులో భాగంగా ఆదివారం బాలాజీ ఎంక్లేవ్ కాలనీలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నీ కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ఏర్పాటు చేసి కాలనీ లోని పలు వీధుల్లో చెత్త మరియు గార్బేజ్ తొలగించడం జరిగింది. అదేవిధంగా బాలాజీ ఎంక్లేవ్ పార్క్ మరియు నార్త్ కళ్యాణ్ పూరి ఎంట్రన్స్ లో గార్బేజ్ నిండిపోతున్న విషయాన్ని కార్పొరేటర్ దృష్టికి తేవడం జరిగింది, అందులో భాగంగా బాలాజీ ఎంక్లేవ్ నార్త్ కళ్యాణ్పురి వారి సౌజన్యంతో కెమెరాలను ఏర్పాటు చేయిస్తామని మాజీ కార్పొరేటర్ తెలపడం జరిగింది కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు గుమ్మకొండ వేణుగోపాల్ రెడ్డి, ఓంకార్ సింగ్, కమిటీ సభ్యులు రమణ గుప్తా, టీజీ వెంకటేష్ డి.శంకర్, సిహెచ్ ప్రవీణ్ రావు, శరభయ్య, శ్రీనివాస చారి, డి వరప్రసాద్, పి సిద్దేశ్వర రావు గౌతమ్, శానిటేషన్ సూపర్వైజర్ శ్రీనివాస్ వారి సిబ్బంది పాల్గొన్నారు.

## బిజినెస్

### వాట్సాప్‌లో కొత్త రూల్..
### వయస్సు వివరాలపై చర్చ!



ప్రపంచంలో ఎక్కువమంది ఉపయోగించే మెసేజింగ్ యాప్‌లలో ఒకటైన వాట్సాప్‌లో కొత్త మార్పు కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది భారతీయ వినియోగదారులను తమ పుట్టిన తేదీ వివరాలు నమోదు చేయాలని వాట్సాప్ కోరుతున్నట్లు సమాచారం. దీంతో వాట్సాప్ వయస్సు ధృవీకరణ నిబంధనలను తీసుకురావడానికి సిద్ధమవుతోందా?.. అనే చర్చ మొదలైంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన సోషల్ మీడియా పోస్టులు కూడా వైరల్ అవుతున్నాయి. ఇందులో యూజర్లను పుట్టిన తేదీని నమోదు చేయమని కోరుతున్నట్లు కనిపించింది. బహుశా భారత ప్రభుత్వం నిబంధనల కారణంగా ఈ అప్డేట్ తీసుకొస్తోందా?, అనే సందేహం కలుగుతోంది. అయితే.. ఈ విషయంపై ఇప్పటివరకు వాట్సాప్ కానీ, భారత ప్రభుత్వం కానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాబట్టి ఇది పూర్తిగా నిజమని నమ్మలేము. అధికారిక సమాచారం వచ్చే వరకు వేచి చూడాలి.

### పెరిగిన పెట్రోల్, డీజిల్ అమ్మకాలు..
### తగ్గిన ఎల్పీజీ సేల్స్



భారత్‌లో ఎల్‌నినో ప్రభావంతో కొన్నిరాష్ట్రాల్లో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. జులైలో నైరుతి రుతుపవనాలు బలహీనంగా మారడంతో వర్షాలు తగ్గి రైతులు, వాహనదారుల నుంచి పెట్రోలు , డీజిల్‌కు డిమాండ్ పెరగడంతో దేశంలోని మూడు ప్రధాన ప్రభుత్వ చమురు కంపెనీల విక్రయాలు పెరిగినట్లు పారిశ్రామిక సేల్స్ డేటా వెల్లడించింది. ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు గతేడాది జులైలో 3.14 మిలియన్ టన్నుల పెట్రోల్‌ను విక్రయించగా, ఈ ఏడాది జులై వచ్చేసరికి 3.45 మిలియన్ టన్నులు విక్రయించినట్లు తెలిపింది. గతేడాది జులైతో పోలిస్తే ఇది 9.7 శాతం అధికం. 2024 జులైలో ఈ చమురు సంస్థల పెట్రోల్ విక్రయాలు 2.99 మిలియన్ టన్నులుగా కాగా, రెండేళ్లతో పోలిస్తే ప్రస్తుతం పెట్రోల్ విక్రయాలు 15.1 శాతం పెరిగాయి. ఇక ఈ ఏడాది జూన్‌లో పెట్రోల్ అమ్మకాలు 3.48 మిలియన్ టన్నులు కాగా, జులై వచ్చేప్పటికీ 1.1 శాతం అమ్మకాలు తగ్గాయి.

భారత ఆర్థిక కార్యకలాపాలకు కీలక సూచిక అయిన డీజిల్ అమ్మకాలు గతేడాది జులైతో పోలిస్తే ఈ ఏడాది 10.7 శాతం అధికంగా నమోదయ్యాయి. 2025 జులైలో 6.43 మిలియన్ టన్నుల డీజిల్ విక్రయాలు జరగగా, ఈ ఏడాది జులైలో 7.12 మిలియన్ టన్నులుగా ఉంది. సరకు రవాణా, వ్యవసాయ యంత్రాల్లో, నీటిపారుదలకు సంబంధించి భారత్‌లో డీజిల్‌ను కీలక ఇంధనంగా ఉపయోగిస్తారు. జులై నెల విత్తనాల కాలం కావడం, సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదుకావడంతో నీటిపారుదల కోసం డీజిల్ వినియోగం భారీగా పెరిగినట్లు నిపుణులు పేర్కొన్నారు. 2024 జులైతో పోలిస్తే ఈ ఏడాది డీజిల్ విక్రయాలు 11.5 శాతం, 2023 ఏడాదితో పోలిస్తే 12.7 శాతం ఎక్కువగా నమోదైనట్లు పారిశ్రామిక వర్గాలు తెలిపాయి. ఇక ఈఏడాది జూన్‌తో పోలిస్తే జులైలో 9.2 శాతం తక్కువగా డీజిల్ అమ్మకాలు జరిగాయి. సాధారణంగా రుతుపవనాల రాకతో ఏటా చమురు విక్రయాలు పడిపోతాయి. వ్యవసాయ పంపుల వాడకం తగ్గడంతో పాటు, సరకు రవాణా నెమ్మెదిస్తుంది. దీని కారణంగా జులైలో విక్రయాలు తగ్గుతాయి. అయితే ఈసారి రుతుపవనాల ఆలస్యం, సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదు కావడంతో చమురుకు డిమాండ్ పెరిగిందని పారిశ్రామిక వర్గాల నిపుణులు తెలిపారు.

## రికార్డు స్థాయిలో కార్ల అమ్మకాలు..
# హ్యుందాయ్‌కు ఆల్‌టైమ్ రికార్డు!




ఇండియా కార్ల మార్కెట్‌కు 2026 జూలై నెల మంచి ఊపునిచ్చింది. దేశంలోని ప్రముఖ కార్ల తయారీ సంస్థలు దాదాపు అన్నీ కూడా.. గత ఏడాది జూలైతో పోలిస్తే మెరుగైన అమ్మకాలను నమోదు చేశాయి. ముఖ్యంగా హ్యుందాయ్ తన చరిత్రలోనే అత్యధిక నెలవారీ అమ్మకాలను సాధించగా, టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ కార్ల విక్రయాల్లో భారీ వృద్ధిని నమోదు చేసింది. మహీంద్రాకంపెనీ ఎస్‌యూవీ విభాగంలో మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకోగా, కియా, టయోటా, ఎంజీ మోటార్, నిస్సాన్ కూడా బలమైన విక్రయాలను పొందాయి. టాటా మోటార్స్.. జూలైలో మొత్తం 63,760 ప్యాసింజర్ వాహనాలను విక్రయించింది. గత ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 40 వేల యూనిట్లతో పోలిస్తే ఇది 59 శాతం ఎక్కువ. ఇందులో దేశీయ మార్కెట్‌లోనే 62,611 వాహనాలు అమ్ముడయ్యాయి. ముఖ్యంగా.. ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో టాటా మరోసారి తన సత్తా చాటింది. జూలైలో 15,217 ఈవీలను విక్రయించి గత ఏడాది కంటే.. 114 శాతం వృద్ధిని నమోదు చేసింది. మహీంద్రా కంపెనీ.. జూలైలో దేశీయ మార్కెట్‌లో 60,048 ఎస్‌యూవీలను విక్రయించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 20 శాతం అధికం. అన్ని రకాల వాహనాలను కలిపి చూస్తే మహీంద్రా మొత్తం 1,03,860 యూనిట్లను విక్రయించి 26 శాతం వృద్ధిని సాధించింది. విదేశీ మార్కెట్లకు చేసిన ఎగుమతులు కూడా గణనీయంగా పెరిగాయి.

హ్యుందాయ్ మోటార్ ఇండియా.. దేశీయ అమ్మకాలు, ఎగుమతులు కలిపి మొత్తం 75,360 వాహనాలను విక్రయించింది. ఇది హ్యుందాయ్ భారత చరిత్రలోనే అత్యధిక నెలవారీ అమ్మకాలుగా నిలిచింది. దేశీయంగా 54,210 కార్లు అమ్ముడవగా, ఎగుమతులు కూడా ఎనిమిదేళ్లలో అత్యధిక స్థాయికి చేరాయి. కంపెనీకి అత్యధిక అమ్మకాలు తెచ్చిపెట్టిన మోడల్‌గా క్రెటా నిలవగా, ఐ20 కూడా ఈ ఏడాదిలో అత్యుత్తమ నెలవారీ విక్రయాలను నమోదు చేసింది.

కియా ఇండియా కూడా.. జూలైలో రికార్డు స్థాయి అమ్మకాలను నమోదు చేసింది. మొత్తం 28,200 యూనిట్లను విక్రయించి గత ఏడాదితో పోలిస్తే 27.4 శాతం వృద్ధిని సాధించింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు కంపెనీ విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా కొత్త తరం సెల్టోస్‌కు మార్కెట్‌లో మంచి ఆదరణ లభిస్తోంది. సోనెట్, కారెన్స్ క్లావిస్, కారెన్స్ క్లావిస్ ఈవీ, సైరోస్ ఈవీ వంటి మోడళ్లు కూడా అమ్మకాలకు ఊతమిచ్చాయి.

టయోటా కిర్లోస్కర్ మోటార్ జులైలో మొత్తం 32,516 వాహనాలను విక్రయించి వృద్ధిలో నిలకడను చూపించింది. దేశీయ మార్కెట్‌లో 30,516 యూనిట్లు అమ్ముడయ్యాయి. గత ఏడాదితో పోలిస్తే.. కంపెనీ దేశీయ అమ్మకాలు 5 శాతం పెరిగాయి. అలాగే ఈ ఏడాది తొలి ఏడు నెలల్లో టయోటా మొత్తం విక్రయాలు 13 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా.. వరుసగా రెండో నెల అత్యధిక నెలవారీ అమ్మకాలను నమోదు చేసింది. జూలైలో 8,158 వాహనాలను విక్రయించిన కంపెనీ, తన మొత్తం అమ్మకాలలో 80 శాతానికి పైగా ఎలక్ట్రిక్ వాహనాలేనని వెల్లడించింది. దీంతో భారత ఈవీ మార్కెట్‌లో ఎంజీ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది.

ఇక నిస్సాన్ జూలైలో.. దేశీయ మార్కెట్‌లో 4,518 వాహనాలను విక్రయించి ఏకంగా 218 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇటీవల విడుదలైన కొత్త టెక్టాన్ ఎస్‌యూవీకి వినియోగదారుల నుంచి మంచి స్పందన రావడంతో కంపెనీ అమ్మకాలు ఒక్కసారిగా పెరిగాయి.

### స్విగ్గీ, జొమాటోకు పోటీగా ఫుడ్‌డెలివరీలోకి ఫ్లిప్‌కార్ట్

ఫుడ్‌డెలివరీ సేవల్లో స్విగ్గీ, జొమాటోకు గట్టి పోటీ ఇచ్చేందుకు ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ సిద్ధమవుతోంది. దేశంలోనే తొలిసారి బెంగళూరు నగరంలో ఆగస్టు 15 కంటే ముందే ఈ సేవలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. ఇందులో భాగంగా రెస్టరంట్ల ఆన్‌బోర్డింగ్ ప్రక్రియను ప్రారంభించిందని ఆంగ్ల వెబ్‌సైట్ 'మనీకంట్రోల్' పేర్కొంది. ప్రస్తుతం ఫుడ్ డెలివరీ సంస్థలు రెస్టరంట్లు, హోటళ్ల నుంచి 16 నుంచి 30 శాతం వరకు కమీషన్‌ను తీసుకుంటున్నాయి. ఫ్లిప్‌కార్ట్ మాత్రం 10 శాతం కమీషన్‌తో రెస్టరంట్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. తొలుత బెంగళూరు నగరంలో ప్రయోగాత్మకంగా ఈ సేవలను పరీక్షించాక దేశవ్యాప్తంగా విస్తరించనుంది. కొన్ని వారాల్లో ఫుడ్ డెలివరీ సేవలు ప్రారంభించబోతున్నట్లు ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ సీఈవో కల్యాణ కృష్ణమూర్తి ప్రకటించిన కొద్దిరోజులకే ఆ గ్రూప్ తన సన్నాహాలను వేగవంతం చేయడం గమనార్హం. గతంలో ఫ్లిప్‌కార్ట్ మినిట్స్ (క్విక్ కామర్స్) సేవలను ప్రారంభించిన తరహాలోనే పరిమిత సంఖ్యలో వినియోగదారులకు ఈ సేవలను ఫ్లిప్‌కార్ట్ అందుబాటులోకి తేనుంది. వారి నుంచి అభిప్రాయాలు తీసుకుని, ఎప్పటికప్పుడు సేవలను మెరుగుపరుచుకుంటూ దశలవారీగా విస్తరించనుంది. ఫ్లిప్‌కార్ట్ తన ప్రధాన యాప్‌తో పాటు, ఫుడ్ డెలివరీ విభాగం కోసం ప్రత్యేకంగా మరో యాప్‌ను కూడా తీసుకురానుంది. ప్రస్తుతం జొమాటో, స్విగ్గీ సంస్థలు మార్కెట్‌ను శాసిస్తున్నాయి. ఇటీవల రాపిడో కూడా ఈ విభాగంలోకి ప్రవేశించింది. ఇప్పుడు వాల్‌మార్ట్ వంటి దిగ్గజ సంస్థకు చెందిన ఫ్లిప్‌కార్ట్ ఈ రంగంలోకి ప్రవేశిస్తుండడంతో మరోసారి ఫుడ్ డెలివరీ విభాగంలో పోటీ తీవ్రం కానుంది.




## పాక్‌ను మరోసారి చిత్తు చేసిన శ్రీలంక..
# మరో సిరీస్ కైవసం

శ్రీలంక పర్యటనలో పాకిస్తాన్ మహిళల క్రికెట్ జట్టుకు వరుస పరాభవాలు ఎదురవుతున్నాయి. తొలుత మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను కోల్పోయిన (1-2తో) ఈ జట్టు.. తాజాగా మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 0-2 తేడాతో కోల్పోయింది. దంబుల్లా వేదికగా ఇవాళ జరిగిన రెండో టీ20లో ఆతిథ్య జట్టు పాక్‌పై 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. శ్రీలంక మరో 14 బంతులు (17.4 ఓవర్లు) మిగిలుండగానే కేవలం 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ చమారీ ఆటపట్టు (40), సంజనా కవిండి (46) మెరుపు ఇన్నింగ్స్ ఆడి లంక విజయంలో కీలకపాత్ర పోషించారు. విష్మి గుణరత్నే (31), హర్షిత సమరవిక్రమ (37 నాటౌట్) కూడా ఉపయోగకరమైన ఇన్నింగ్స్‌లు ఆడారు. ఆఖర్లో కవిష దిల్హారి (14 నాటౌట్) కూడా బ్యాట్ ఝులిపించింది. పాక్ బౌలర్లలో హనీ 2, వహీదా, అయేషా జాఫర్ తలో వికెట్ తీశారు. అంతకుముందు పాక్ తరఫున ఓపెనర్లు మునీబా అలీ (45), షావాల్ జుల్ఫికర్ (48) రాణించారు. ఆఖర్లో ఫాతిమా (30 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. మిగతా ప్లేయర్లలో ఎమాన్ నసీర్ 21, అయేషా జాఫర్ 8, సైరా జబీన్ 16, హనీ 2 (నాటౌట్) పరుగులు చేశారు. లంక బౌలర్లలో ప్రబోధ 2, సుగంధక? కుమారి, చమారీ ఆటపట్టు, కవిష దిల్హారి తలో వికెట్ తీశారు. ఈ సిరీస్‌లో నామమాత్రపు మూడో టీ20 ఆగస్టు 4న జరుగనుంది.



### బుమ్రా స్థానంలో సంచలన ఫాస్ట్ బౌలర్..?

ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో ప్రారంభం కానున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా దూరం కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అతడి స్థానాన్ని ఎవరితో భర్తీ చేస్తారనే అంశంపై జోరుగా చర్చ సాగుతోంది. ఈ క్రమంలో 29 ఏళ్ల సంచలన ఫాస్ట్ బౌలర్, జమ్మూ అండ్ కశ్మీర్ ఎక్స్‌ప్రెస్‌గా పేరున్న ఆకిబ్ నబీ దార్ పేరు తెరపైకి వచ్చింది. బుమ్రాకు ప్రత్యామ్నాయంగా నబీ పేరు దాదాపుగా ఖరారైనట్లు బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. నబీకి దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. 2025-26 రంజీ ట్రోఫీలో అతడు 10 మ్యాచ్‌ల్లో 60 వికెట్లు తీసుకుని టోర్నీలో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. జమ్మూ కశ్మీర్ తొలి రంజీ ట్రోఫీ టైటిల్ సాధించడంలోనూ నబీ కీలక పాత్ర పోషించాడు.

ఓవరాల్‌గా అతడి ఫస్ట్‌క్లాస్ రికార్డు కూడా ఆకట్టుకునేలా ఉంది.




మ్యాచ్‌లు: 43
వికెట్లు: 162
బౌలింగ్ సగటు: 18.63
5 వికెట్ల ప్రదర్శనలు: 16
10 వికెట్ల ప్రదర్శనలు: 4
అత్యుత్తమ బౌలింగ్: 7/24

**శ్రీలంకలోనూ సత్తా నబీ**

ఇటీవల భారత్-ఏ జట్టుతో కలిసి శ్రీలంక పర్యటనకు వెళ్లిన నబీ, శ్రీలంక-ఏతో జరిగిన రెండు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో నాలుగు ఇన్నింగ్స్‌లలో 6 వికెట్లు పడగొట్టాడు. తొలి మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 4/58తో ఆకట్టుకున్నాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నబీకి ఇప్పటివరకు భారత సీనియర్ జట్టులో ఆడిన అనుభవం లేదు. అయినప్పటికీ దేశవాళీ క్రికెట్‌లో అతడి నిలకడైన ప్రదర్శన, శ్రీలంక పరిస్థితులపై ఇటీవల వచ్చిన అనుభవం అతడికి కలిసొచ్చే అవకాశముంది.

## స్పోర్ట్స్

### ఆసియా కప్ 2026కు భారత జట్టు ప్రకటన




మహిళల ఆసియా కప్ 2026 కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టును ప్రకటించింది. కెప్టెన్సీపై ఇటీవల చర్చ జరిగినప్పటికీ హర్మన్‌ప్రీత్ కౌర్‌నే కెప్టెన్‌గా కొనసాగించింది. స్మృతి మంధానను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేసింది. జట్టులో స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ వంటి కీలక ప్లేయర్లకు చోటు దక్కింది.

**శ్రేయాంక పాటిల్‌కు చోటు లేదు**

టీ20 ప్రపంచకప్ జట్టులో ఉన్న శ్రేయాంక పాటిల్‌కు ఆసియా కప్ జట్టులో చోటు దక్కలేదు. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో ఆమె కుడి చీలమండకు గాయమయ్యింది. శ్రేయాంక స్థానంలో టీ20 ప్రపంచకప్ జట్టులోకి వచ్చిన ప్రేమా రావత్ ఆసియా కప్ జట్టులోనూ కొనసాగింది. ఇదే జట్టులో జరిగిన ప్రధాన మార్పు.

**భారత మహిళల ఆసియా కప్ 2026 జట్టు**

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భారతి ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమిలిని, అరుంధతి రెడ్డి, ప్రేమా రావత్, రాధా యాదవ్, శ్రీ చరణి, రేణుకా ఠాకూర్, నందిని శర్మ, క్రాంతి గౌడ్. కాగా, ఆసియా కప్ 2026 సెప్టెంబర్ 17న మొదలై 22వ తేదీ వరకు జరుగనుంది. ఈ టోర్నీ ఫిక్చర్స్ ఇంకా ఖరారు కాలేదు.





# మౌళి క్రైమ్ కామెడీకి ఇంట్రెస్టింగ్ టైటిల్

## వెరైటీ టైటిల్‌తో రాబోతున్న మైత్రీ మూవీ మేకర్స్..

ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల 'లిటిల్ హార్ట్స్' సినిమాతో విజయాన్ని అందుకున్న యువ నటుడు మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'దొంగ నా కొడకా' అనే వినూత్నమైన టైటిల్‌ను ఖరారు చేసినట్టు తెలుస్తుంది.. ఈ చిత్రానికి నూతన దర్శకుడు శ్రీను కంబాల దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ చివరి దశకు చేరుకున్న ఈ మూవీని క్రైమ్ కామెడీ జానర్‌లో తెరకెక్కిస్తున్నారు. వినోదంతో పాటు థ్రిల్లింగ్ అంశాలను కలగలిపిన కథతో ప్రేక్షకులను ఆకట్టుకునేలా దర్శకుడు శ్రీను కంబాల ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. కథలో వచ్చే ట్విస్టులు, కామెడీ ట్రాక్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కళాశాలలో ఘనంగా ఆవిష్కరించేందుకు మేకర్స్ సిద్ధమయ్యారు. యువతను ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఈ ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టైటిల్ ప్రకటించకముందే సినిమా గురించి ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ జరుగుతుండగా, ఇప్పుడు 'దొంగ నా కొడకా' అనే టైటిల్ ప్రేక్షకుల్లో మరింత క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ చిత్రంలో సుష్మితా షెన్ కథానాయికగా నటిస్తోంది. హీరో-హీరోయిన్ల మధ్య వచ్చే వినోదభరితమైన సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని సమాచారం. సినిమాటోగ్రాఫర్ సూర్య బాలాజీ తన కెమెరాతో చిత్రానికి ప్రత్యేక విజువల్ టోన్ అందిస్తున్నట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువలకు తగ్గట్టుగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కథకు తగ్గట్టుగా నాణ్యమైన నిర్మాణ విలువలు, వినోదాత్మక స్క్రీన్‌ప్లే, విభిన్నమైన పాత్రలు సినిమాపై మంచి అంచనాలు పెంచుతున్నాయి. త్వరలోనే టైటిల్, ఫస్ట్‌లుక్ విడుదలతో పాటు సినిమా విడుదల తేదీ, టీజర్, ట్రైలర్ వంటి ఇతర వివరాలను కూడా చిత్ర బృందం ప్రకటించనుంది. వినూత్నమైన టైటిల్‌తో వస్తున్న 'దొంగ నా కొడకా' ప్రేక్షకులను ఏ స్థాయిలో అలరిస్తుందో చూడాలి.

# చిరంజీవి, నాగార్జునతో మల్టీస్టారర్.. అనిల్ ప్లాన్ అదుర్స్

మల్టీ స్టారర్ చిత్రాలకు తెలుగులో మంచి ఆదరణ ఉంటుంది. ఇద్దరు స్టార్ హీరోలు కలిసి నటిస్తే.. యావరేజ్ ఉన్నా సరే.. సినిమాను సూపర్ హిట్ చేస్తారు. అందుకే గతంలో ఎక్కువగా మల్టీస్టారర్ చిత్రాలు వచ్చేవి. ఈ మధ్య తెలుగు హీరోలంతా పాన్ ఇండియా సినిమాలపై ఫోకస్ పెట్టడం.. సోలోగా రాణించాలనే తపనతో మల్టీస్టారర్‌పై ఆసక్తి చూపించడం లేదు. అయితే స్టార్స్ కలిసి చేస్తే మాత్రం ఆ సినిమా చూడాలని ప్రేక్షకులు కోరుకుంటున్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి ఇప్పుడు అదే చేయబోతున్నాడు. టాలీవుడ్ సీనియర్ హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నాగార్జునలతో క్రేజీ సినిమా తెరకెక్కించబోతున్నాడట. అనిల్ రావిపూడి సినిమాలు ఎలా ఉంటాయో తెలిసిందే. స్టార్స్‌తో కూడా కామెడీ చేయించి హిట్ కొడతాడు. ఇప్పటికే చిరంజీవి, వెంకటేష్, బాలకృష్ణలతో బ్లాక్ బస్టర్ హిట్స్ తీశాడు. ఇప్పుడు ఆయన ఫోకస్ నాగార్జునపై పడింది. నాగార్జునతో సినిమా చేస్తానని అనిల్ ఎప్పటి నుంచో చెబుతున్నాడు. త్వరతోనే ఈ ప్రాజెక్ట్‌ని పట్టాలపైకి ఎక్కించబోతున్నాడు. ప్రస్తుతం నాగార్జున తన 10వ సినిమాలో బిజీగా ఉన్నాడు. ఇది పూర్తయిన తర్వాత అనిల్‌తో సినిమా చేస్తాడని ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. అయితే తాజా సమాచారం ప్రకారం.. నాగార్జునతో సోలో సినిమా కాకుండా చిరంజీవిని కూడా కలిపి మల్టీస్టారర్ రూపొందించాలని అనిల్ ప్లాన్ చేస్తున్నాడట. ఇలా ఇద్దరూ కలిసి ఒకే సినిమాలో కనిపిస్తే అభిమానులకు అది నిజంగా పండగ అనే చెప్పొచ్చు. అంతేకాదు.. తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా ఈ సినిమాపై భారీ క్రేజ్ ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.






# రామాయణంలో సీత పాత్ర వివాదం..

## సాయి పల్లవి పాత ఇంటర్వ్యూ వైరల్!

రామాయణంలో సీత పాత్రలో నటిస్తున్న సాయి పల్లవి ఎంపికపై సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. సీత పాత్రకు సాయి పల్లవిని ఎలా తీసుకున్నారంటూ కొందరూ కామెంట్లు చేస్తుండగా.. ఈ చర్చల మధ్య సాయిపల్లవి గతంలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ నెట్టింట వైరల్ అవుతోంది. సాంప్రదాయ రూపురేఖల గురించి కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, ఆమె నటనకు, సహజ సౌందర్యానికి మరికొందరు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో తన చిన్ననాటి మొటిమల సమస్య, ఫెయిర్‌నెస్ క్రీమ్ యాడ్ తిరస్కరించడం గురించి సాయి పల్లవి గతంలో చెప్పిన ఆసక్తికర విషయాలు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి. సినిమాల్లోకి రాకముందు తనకు ఉన్న మొటిమలు, రోసిషియా సమస్య కారణంగా ఎంతో ఆందోళన చెందానని సాయి పల్లవి గతంలో తెలిపారు. 'ప్రేమమ్' సినిమా విడుదలకు ముందు నేను ఎన్నో ఫెయిర్‌నెస్ క్రీమ్‌లు వాడాను. ముఖంపై మొటిమల వల్ల ఎంతో మానసిక వేదన అనుభవించాను. నలుగురిలోకి వెళ్లడానికి భయపడేదాన్ని. జనం నా కళ్లను కాకుండా నా మొటిమలనే చూస్తున్నారని బాధపడేదాన్ని అని ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే 'ప్రేమమ్' చిత్రంతో ప్రేక్షకులు తనను ఉన్నట్లుగానే ఆదరించడంతో తనలో ఆత్మవిశ్వాసం పెరిగిందని ఆమె చెప్పారు. సౌందర్య ప్రమాణాలు, రంగు వివక్షపై సాయి పల్లవి ఎప్పుడూ కఠినంగా వ్యవహరిస్తుంటారు. ఇందులో భాగంగానే రూ. 2 కోట్ల విలువైన ఫెయిర్‌నెస్ క్రీమ్ ఎండార్స్‌మెంట్ ఆఫర్‌ను ఆమె సున్నితంగా తిరస్కరించారు. సమాజంలో ఇటువంటి ప్రచారాలు యువత ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆమె భావించారు. సమాజంలో రంగు ఆధారంగా ఎంతోమందిని చిన్నచూపు చూస్తున్నారు. అలాంటి ప్రమాణాలను నేను ప్రమోట్ చేయలేను అని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె పాత వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్నాయి.

# 'ఎల్లమ్మ' అప్‌డేట్.. దేవి వింటేజ్ ఫస్ట్ లుక్




'బలగం' ఫేమ్ వేణు దర్శకత్వం వహిస్తున్న కొత్త సినిమా 'ఎల్లమ్మ'. ఎప్పటినుంచో సెట్స్ మీద ఉంది. ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఈ ప్రాజెక్టుతో హీరోగా పరిచయమవుతున్నాడు. కొన్నాళ్ల క్రితం గ్లింప్స్ లాంటి వీడియో రిలీజ్ చేశారు. తర్వాత నుంచి పూర్తిగా సైలెంట్ అయిపోయారు. మళ్లీ ఇన్నాళ్లకు మరో అప్‌డేట్ ఇచ్చేశారు. దేవిశ్రీ ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా 'ఎల్లమ్మ' ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. ఇందులో పార్సి అనే కుర్రాడిగా కనిపించబోతున్నాడు. క్లీన్ షేవ్ చేసిన లుక్‌లో దేవి డిఫరెంట్‌గా ఉన్నాడు. చెప్పాలంటే బయట కనిపించేదానికి సినిమాలో కనిపించే దానికి మొత్తానికి మార్చేసినట్లు తెలుస్తోంది. దిల్ రాజు ఈ చిత్రానికి నిర్మాత కాగా హీరోయిన్ ఎవరు? మిగతా నటీనటులు ఎవరనేది ఇంకా బయటపెట్టలేదు. రిలీజ్ ఎప్పుడనేది కూడా ప్రస్తుతానికి ఇంకా సస్పెన్స్.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,